RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 321 మేడ్చల్ మల్కాజ్‌గిరి 12 డిసెంబర్ 2024 గురువారం పేజీలు : 4

### త్వరలో 'రైల్వే సూపర్ యాప్' ఆవిష్కరణ

న్యూఢిల్లీ : రైల్వే సేవలన్నీ ఒకే చోట లభ్యమయ్యే 'సూపర్ యాప్' త్వరలో అందుబాటులోకి రానుంది. టిక్కెట్ల బుకింగ్, రిజర్వేషన్లు, ప్లాట్‌ఫారం టిక్కెట్లు, కేటరింగ్... తదితర సేవలన్నింటినీ సమన్వయపరిచి ఒకే యాప్ రూపంలో ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వే శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది. 'క్రిస్' సంస్థ ఈ నూతన యాప్ రూపకల్పనలో నిమగ్నమయింది. ఈ సమగ్ర మొబైల్ అప్లికేషన్ వచ్చే నెలలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

ప్రస్తుతం ఐఆర్‌సీటీ సీ వెబ్‌సైట్ల ద్వారా ప్రయాణికులకు సేవలు అం దుతున్నాయి. ఒక్కో సేవకు ఒక్కో అప్లికేషన్ ఉండడంతో వాటన్నింటినీ సమన్వయపరిచి సమగ్రమై న యూప్‌ను రూపొందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# ఈ శీతాకాల సమావేశాల్లోనే...

# 'రాజముద్ర'




## జమిలి వైపు వేగంగా అడుగులు

## బిల్లు ప్రవేశపెట్టి... ఆమోదం పొందేలా మోడీ భారీ స్కెచ్!

దేశంలో మరో రెండేళ్లలో ఎన్నికలు రానున్నాయా అంటే వస్తాయని ఢిల్లీ వర్గాలు అంటున్నారు. రెండేళ్లు ఏంటి అంటే 2024 మరి కొద్ది రోజులలో ముగిసి 2025లోకి ఎంట్రీ ఇస్తున్న వేళ కేంద్రంలో ఎన్డీయేకు నాయకత్వం వహిస్తున్న బీజేపీ జమిలి ఎన్నికల మీద రోడ్ మ్యాప్ తో సిద్ధంగా ఉంది. 2025కి 2027 కచ్చితంగా రెండెళ్ళే. ఒక వేళ 2027 ఎండింగ్ లో ఎన్నికలు పెడితే మాత్రం దాదాపుగా మూడేళ్ల వ్యవధి ఉంటుంది. అయితే అంతవరకూ కథను ముందుకు తీసుకుని పోలేరు. జమిలి ఎన్నికలు అంటే దానికి ఏణ్ణర్థం ముందునా తరువాత జరిగే అసెంబ్లీ ఎన్నికలను కూడా చేర్చాలి కాబట్టి 2027 మేలోనే ఎన్నికలు పెడతారు అని అంటున్నారు. అలా కాదు అంటే జమిలి ఎన్నికలకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయినట్లే అని అంట్నాయి ఢిల్లీ వర్గాలు. ప్రస్తుతం పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమావేశాల్లోనే జమిలి ఎన్నికల బిల్లుని ప్రవేశపెడతారు అని అంటున్నారు. ఈ మేరకు బీజేపీ వర్గాలు కూడా పేర్కొన్నట్లు తెలుస్తోంది. భారత మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ఇచ్చిన నివేదికను ఇప్పటికే కేంద్ర మంత్రివర్గం ఆమోదించి తొలి అడుగు వేసింది. ఇక వేయాల్సిన మరిన్ని అడుగులకు రంగం సిద్ధం అవుతోంది. ఇక బీజేపీ ఒక పద్ధతి ప్రకారం ఈ సమావేశాల్లో జమిలి ఎన్నికల బిల్లుని తీసుకుని వస్తోంది అని అంటున్నారు. జమిలి ఎన్నికల బిల్లుకు లోక్ సభ రాజ్యసభలలో ఆమోదముద్ర పడేలా బీజేపీ పెద్దలు చూస్తున్నారు. అదే జరిగితే ఇక బీజేపీ జమిలి ఎనికల రథానికి బ్రేకులు ఉండవని అంటున్నారు. ఇక 2027లో దేశవ్యాప్తంగా పార్లమెంట్ తో పాటు అన్ని శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయని అంటున్నారు. ఇక జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లుని చాలా జాగ్రత్తగా బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రూపొందించింది అని అంటున్నారు. జమిలి ఎన్నికల వల్ల దేశంలో అయిదేళ్లకు ఒకసారి మాత్రమే ఎన్నికల హడావుడి ఉంటుంది. మిగిలిన సమయంలో అభివృద్ధి మీదనే దృష్టి ఉంటుందని అలాగే ఖర్చులు కూడా కలసి వస్తాయని బీజేపీ అంటోంది. అయితే విపక్షాలు మాత్రం జమిలి ఎన్నికలు వద్దు అని అది బీజేపీ జాతీయ అజెండాను రాష్ట్రాల మీద రుద్దడానికి అని అంటున్నారు తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే పార్టీ అధినేత ముఖ్యమంత్రి స్టాలిన్ జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్నారు. వామపక్షాలతో పాటు ఇండియా కూటమిలోనూ వ్యతిరేకత ఉంది. అయితే ఎన్నికలు మళ్లీ వస్తే గెలవవచ్చు అన్న ఆశ కూడా ఎక్కడో విపక్షాలలో ఉండడంతో పార్లమెంట్ లో జమిలి బిల్లు పెడితే స్పందన భిన్నంగా ఉండవచ్చు అని అంటున్నారు.

మొత్తం మీద బీజేపీ జమిలి ఎన్నికల కోసం చకచకా పావులు కదుపుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.




భారత ప్రభుత్వం తీసుకువచ్చిన అనేక సంక్షేమ పథకాలలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన చాలా ముఖ్యమైనదిగా చెప్పొచ్చు. ఈ పథకం ద్వారా దేశ వ్యాప్తంగా ఉన్న లక్షలాది రైతులు ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్నారు. పంటకు పెట్టుబడి సాయం కింద.. కేంద్రం నుంచి డబ్బులు అందుకుంటున్నారు. ఏడాదికి మూడు వాయిదాలు చొప్పున మొత్తం రూ. 6 వేలు ఇస్తోంది కేంద్ర ప్రభుత్వం. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం కింద ఇప్పటికే 18 వాయిదాలుగా డబ్బులను రైతుల ఖాతాలో జమ చేస్తోంది కేంద్ర ప్రభుత్వం. ఇప్పుడు 19వ విడత నిధుల విడుదలకు సమయం ఆసన్నమైంది. మరి ఈ విడత ప్రయోజనం పొందాలంటే రైతులు కొన్ని పనులు చేయాల్సి ఉంటుంది. ఏమైనా పొరపాట్లు చేస్తే మాత్రం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం డబ్బులు పొందలేరు.

**అర్హులేనా..** ఏదైనా ప్రభుత్వ పథకం ద్వారా ప్రయోజనం పొందాలంటే.. ముందుగా ఆ పథకానికి మీరు అర్హులా కాదా అనేది తెలుసుకోవడం ముఖ్యం. ఈ స్కీమ్‌కు మీరు అర్హులని భావిస్తే.. అప్పుడు అప్లై చేసుకోవచ్చు.

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకానికి అప్లై చేసుకోవాలంటే కొన్ని అర్హతలు ఉంటాయి. ముందుగా మీరు రైతు అయి ఉండాలి. దాంతో పాటు బీపీఎల్ పరిధిలోకి రావాలి.

**ఈ తప్పులు చేస్తే డబ్బులు రావు..** కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 18 విడతలుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. 19వ విడత డబ్బులు కూడా త్వరలో రానున్నాయి. ఈ డబ్బులు పడాలంటే రైతులు కొన్ని తప్పులు అస్సలు చేయకూడదు. పొరపాటున కూడా ఆ తప్పుల చేసినట్లయితే..

పథకం డబ్బులు అందుకోలేరు. మరి రైతులు ఎలాంటి పొరపాట్లు చేయొద్దో ఇప్పుడు తెలుసకుందాం..

**ఈ తప్పులు అస్సలు చేయొద్దు..** 1. ల్యాండ్ వేరిఫికేషన్ పనిని అసంపూర్తిగా వదిలేయొద్దు. ల్యాండ్ వేరిఫికేషన్ తప్పనిసరిగా చేయించాలి. ఒక వేళ రైతులు ల్యాండ్ వేరిఫికేషన్ చేయించకపోతే.. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన ప్రయోజనం పొందలేరు. మీకు ఈ పథకం డబ్బులు అందాలంటే.. తప్పనిసరిగా ల్యాండ్ వేరిఫికేషన్ చేయించాలి. 2. చాలా మంది రైతులు ఈ-కేవైసీ చేయించరు. ఈ-కేవైసీ చేయించకున్నా డబ్బులు వస్తాయని భావిస్తారు. కానీ, అది పెద్ద మిస్టేక్ అవుతుంది. ఈ స్కీమ్‌కు అప్లై చేసుకున్న రైతులందరూ ఈ-కేవైసీని తప్పనిసరిగా చేయించాలి. లేదంటే ఈ పథకం ప్రయోజనం పొందలేరు. అధికారిక వెబ్‌సైట్ pmkisan.gov.in ద్వారా రైతులు ఈ-కేవైసీని పొందవచ్చు. సీఎస్‌సీ కేంద్రానికి కూడా వెళ్లి ఈ పనిని పూర్తి చేయొచ్చు. ఈ-కేవైసీ చేస్తేనే పథకం కింద డబ్బులు పొందుతారు. 3. అప్లికేషన్‌లో పొరపాట్ల కారణంగా కూడా పీఎం కిసాన్ డబ్బులు పొందలేని పరిస్థితి ఉంటుంది. అందుకే అప్లికేషన్ ఫిల్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా నింపాలి. అప్లికేషన్ ఫారమ్‌లో పేరు తప్పుగా ఉండటం, ఆధార్ నెంబర్ తప్పుగా ఉండటం, స్పెల్లింగ్ మిస్టేక్స్ కారణంగా.. మీ అప్లికేషన్ రద్దవుతుంది. అం దుకే.. అప్లికేషన్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. 4. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం పొందాలంటే.. రైతులు తప్పనిసరిగా ఆధార్ లింకింగ్ చేయించాలి. బ్యాంక్ ఖాతా కు, ఆధార్‌ను అనుసంధానం చేయాలి. ఒకవేళ ఆధార్ లింక్ చేయనట్లయితే.. వెంటనే మీ బ్యాంక్ బ్రాంచ్‌కి వెళ్లి ఆధార్ కార్డును లింక్ చేయాలి. లేదంటే.. ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందలేరు.

## వరంగల్ నగరాభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయండి: మంత్రి పొంగులేటి

హైదరాబాద్: వరంగల్ నగరాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో మంత్రి పొంగులేటి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో మంత్రి కొండా సురేఖ, సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇటీవల వరంగల్ పర్యటనకు వచ్చినప్పుడు సీఎం రేవంత్ రెడ్డి స్థానిక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పలు హామీలు ఇచ్చారని తెలిపారు.



నగరంలో అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని, నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా వరంగల్ నగర అభివృద్ధి, ఐఆర్‌ఆర్, ఓఆర్‌ఆర్, భద్రకాళి చెరువు, విమానాశ్రయం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌లను త్వరితగతిన తయారు చేయాలని అధికారులకు సూచించారు. వరంగల్ నగర రింగ్ రోడ్డు జాతీయ రహదారులకు కనెక్టివిటీ ఉండేలా నిర్మాణం చేయాలన్నారు. ఇందుకు అవసరమైన భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. భద్రకాళి చెరువు శుద్ధీకరణ పనులను వేగవంతం చేయాలన్నారు.




## ప్రతీ మండలానికి ఐదుగురు ఎంపీటీసీలు..

## ఈ 'సెషన్'లోనే చట్ట సవరణ?

హైదరాబాద్ : ప్రస్తుతం తెలంగాణలోని 22 మండలాల్లో ఐదుగురి కంటే తక్కువ మంది ఎంపీటీసీలు ఉన్నారు. వీరి సంఖ్య తక్కువగా ఉండటంతో మండలాల్లో రాజకీయ ఘర్షణలు జరుగుతున్నాయి. తక్కువ మంది ఎంపీటీసీలు ఉన్న మండలాల్లో ఒకరు ఎంపీపీ, మరొకరు వైస్ ఎంపీపీగా ఎన్నికవుతున్నారు. మిగితా సభ్యులను కలుపుకొని మండల సర్వసభ్య సమావేశాలను నిర్వహించడం పెద్ద సవాలుగా మారుతోంది. ఈనేపథ్యంలో రాష్ట్రంలోని ప్రతీ మండలంలో తప్పకుండా కనీసం ఐదుగురు ఎంపీటీసీలు ఉండాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు 22 మండలాల్లో ఎంపీటీసీల సంఖ్యను ఐదుకు పెంచేందుకు సీఎం రేవంత్ సర్కారు రెడీ అయింది. ఈ అసెంబ్లీ సెషన్‌లోనే దీనికి సంబంధించిన చట్ట సవరణ చేసేందుకు సమాయత్తం అయింది. తెలంగాణలో మొత్తం 540 మండలాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ ఈసారి అధికారంలోకి వచ్చాక నాలుగు మండలాలను కొత్తగా ఏర్పాటు చేసింది. వీటికి త్వరలోనే ఎన్నికలు నిర్వహించనుంది. ప్రస్తుతం ప్రతి మండలం పరిధిలో సగటున 3వేల జనాభా ఉన్న ఏరియాకు ఒక్కో ఎంపీటీసీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అసెంబ్లీలో చేయనున్న చట్ట సవరణ ద్వారా 3 వేల కంటే తక్కువ జనాభా ఉన్న మండలాల్లోని ఏరియాలను కూడా ఎంపీటీసీ నియోజకవర్గంగా గుర్తించనున్నారు. 5వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాన్ని రెండు ఎంపీటీసీ స్థానాలకు పెంచే ప్రతిపాదన కూడా ఈ చట్టసవరణలో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో మూడు ఎంపీటీసీ స్థానాలు ఉన్న మండలంలో ఎంపీపీ పదవి కోసం ఇద్దరు ఎంపీటీసీలు ఏకమైతే ఒకరు ఎంపీపీ, మరొకరు వైస్ ఎంపీపీ అయ్యేవారు. మిగిలిన ఒక ఎంపీటీసీ అంశాల వారీగా ఆ ఇద్దరికి మద్దతును ప్రకటించేవారు. ఈక్రమంలో కొన్నిసార్లు సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరు అయ్యేవారు. నలుగురు ఎంపీటీసీలు ఉన్న మండలాల్లో సైతం ఇలాంటి పరిస్థితే తలెత్తేది. ఈ ప్రతిష్టంభనను తొలగించేందుకు కాంగ్రెస్ సర్కారు సంకల్పించింది. చట్ట సవరణ చేసి ప్రతి మండలంలో ఎంపీటీసీల సంఖ్యను ఐదుకు పెంచడం ద్వారా రాజకీయ వివాదాలకు ఇక తావు ఉండదని రేవంత్ సర్కారు భావిస్తోంది.

## సంపాదకీయం

# ఆందోళన కలిగిస్తున్న జర్నలిస్టుల మరణాలు.. ఒక్క ఏడాదిలోనే ఇంత మంది..

ఎలాంటి భయానక పరిస్థితులు ఉన్నా.. ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు ఉన్నా.. వార్త కవరేజీలో జర్నలిస్టులు వెనక్కి పోరు. ఇంకా అలాంటి పరిస్థితుల్లోనూ ఎక్స్‌క్లూజివ్ అంటూ వార్తా సేకరణకు పోరాడుతుంటారు. ప్రాణాలను సైతం రిస్క్‌లో పెట్టి ఫొటోల కోసం, వార్తా సేకరణ కోసం పరిగెడుతుంటారు. అలా... రిస్క్ ఘటనలను కవర్ చేస్తూ ఒక్క ఏడాదిలోనే 104 జర్నలిస్టులు మృతిచెందడం విషాదానికి గురిచేసే అంశం. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఏ స్థాయిలో కొనసాగాయో చూశాం. అలాగే.. ఉక్రెయిన్-రష్యా యుద్ధం.. ఇలా ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులే కనిపించాయి. కాగా.. ఈ ఉద్రిక్తతలకు సంబంధించిన సమాచారాన్ని ప్రపంచానికి తెలియజేసేందుకు తమ ప్రాణాలను రిస్క్ చేస్తున్నారు. ఇలా పలువురు జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ప్రపంచంలో ఏ మూల ఏం జరిగినా.. అది సంతోషకరమైన వార్త అయినా.. కన్నీళ్లు తెప్పించే సమాచారం అయినా ప్రజలకు తెలియజేసేందుకు జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తూనే ఉన్నారు. ఇటీవల కాలంలో యుద్ధరంగంలో సైతం ప్రాణాలకు తెగించి కలం వీరులు వార్తలు సేకరించారు. ఫొటో జర్నలిస్టులు సైతం మంచి మంచి ఫొటోలను తీశారు. వాటన్నింటినీ ప్రజలకు చేరవేశారు. ఈ క్రమంలో గాజాలో నెలకొన్న ఉద్రిక్తతలను ప్రపంచానికి తెలియజేసేందుకు ప్రయత్నించిన జర్నలిస్టులు యుద్ధంలో మరణించడం అత్యంత విచారకరం. ఈ ఒక్క ఏడాదే ప్రపంచ వ్యాప్తంగా 104 మంది జర్నలిస్టులు చనిపోయారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అందులో కేవలం గాజాలోనే 81 మంది చనిపోవడం విషాదకరం. ఈ మేరకు ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఓ నివేదికను వెల్లడించింది. ఏడాదిలో 104 మంది జర్నలిస్టులు చనిపోయినట్లు తెలిపింది. 2023లో ఏడాది మొత్తంలో 129 మంది చనిపోయినట్లు పేర్కొంది. అయినప్పటికీ ఈ ఏడాది అత్యంత ఘోరమైన సంవత్సరంగా నిలిచిందని ఐఎఫ్‌జే ప్రధాన కార్యదర్శి ఆంథోని బెల్లాంగర్ తెలిపారు. 2023 అక్టోబరు 7న యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి 14 నెలల కాలంలో గాజాలో 138 మంది జర్నలిస్టులు చనిపోయారు. వారిలో చాలా మందిని ఉద్దేశ పూర్వకంగా చంపినట్లు ప్రచారం ఉంది. ఇక ఆసియాలో 20 మంది జర్నలిస్టులు చనిపోయారు. వారిలో ఆరుగురు పాకిస్తాన్‌లో, ఐదుగురు బంగ్లాదేశ్‌లో, నలుగురు ఉక్రెయిన్ యుద్ధంలో, ముగ్గురు భారత్‌లో చనిపోయినట్లు నివేదికలో వెల్లడించింది. ఇక.. ప్రపంచ వ్యాప్తంగా 520 మంది జర్నలిస్టులు జైలులో ఉన్నట్లు ఐఎఫ్‌జే తెలిపింది. 135 మంది జర్నలిస్టులను హాంకాంగ్‌లో నిర్బంధించినట్లు తెలిపింది. ప్రభుత్వ చర్యలను ప్రశ్నించినందుకే వారికి ఈ విధంగా శిక్ష విధించారని పేర్కొంది.

# రాత్రి గస్తీ..పీసీబీలో నాస్తి



హైదరాబాద్: పౌరుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) నైట్ ప్యాట్రోలింగ్ సిబ్బంది తూతూమంత్రంగా తనిఖీలు చేస్తున్నారు. ఘాటు వాసనలు ఇబ్బంది పెడుతున్నాయంటూ ఫోన్ వస్తే వెంటనే అక్కడికి వెళ్తున్న బృందం.. ఆ వాసనలు ఎక్కడినుంచి వస్తున్నాయో కనిపెట్టడం లేదు.

**ఇదీ చేయాల్సింది..**

పీసీబీ కేంద్ర కార్యాలయం, హైదరాబాద్, ఆర్సీపురం జోన్ కార్యాలయాల పరిధిలో మూడు నైట్ ప్యాట్రోలింగ్ వాహనాలు తిరుగుతుంటాయి. ఒక్కో వాహనంలో ఒక అనలిస్ట్, ఏఈ, ఈఈ స్థాయి అధికారులు, సెక్యూరిటీ గార్డులు ఉంటారు. ఘాటు వాసనలు వచ్చినా, డంపింగ్ చేస్తున్నట్టు సమాచారం అందిన వెంటనే వీరంతా అక్కడికి చేరుకుంటారు. రోజువారీ నిఘాపై వివరణ, నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. అధికారులు ఇచ్చే నివేదికపై 'పీసీబీ సభ్య కార్యదర్శి' స్థాయిలో సమీక్ష జరుగుతుంది.

**వరుస ఫిర్యాదులు**

ఖైరతాబాద్‌లో ఘాటు వాసనలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయంటూ వెంకటరమణ కాలనీ, చింతల్‌బస్తీ ప్రాంతవాసులు పీసీబీకి వరుస ఫిర్యాదులు చేస్తున్నారు. పీసీబీ విభాగం ఇప్పటి వరకు ఆ సమస్యను పరిష్కరించలేదు. నైట్ ప్యాట్రోలింగ్ బృందం సమస్యను గుర్తించలేదు. పటాన్‌చెరు, పాశమైలారం, సూరారం, బాచుపల్లి, చెంగిచెర్ల, నాచారం, మల్లాపూర్ ప్రాంతాల్లో రాత్రివేళ ఘాటు వాసనలు నిత్యకృత్యమయ్యాయి.

ఆటోనగర్ పారిశ్రామికవాడలో బ్యాటరీ దుకాణాలు, సర్వీసింగ్ కేంద్రాలున్నాయి. రసాయన వ్యర్థాలను తరలించేందుకు ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, ఎస్టీపీ సామర్థ్యానికి మించి వ్యర్థాలు ఉత్పత్తి అవడంతో ఘాటు వాసనలు వెల్లువెత్తుతున్నాయి.

# వయ్యారి భామలు.. వలపు బేడీలు!



హైదరాబాద్ : ఆ చూపులకు చిక్కారో.. అడ్డంగా బుక్కయినట్టే. మాటలకు పొంగిపోయారో జేబులు గుల్ల చేసుకున్నట్టే. సరైన జోడు కోసం వెతికే పెళ్లికాని ప్రసాద్‌ల నుంచి.. నచ్చిన మగువతో సరదాగా గడపాలనుకునే పురుషోత్తముల బలహీనతను ఆసరా చేసుకొని వయ్యారీ కిలేడీలు వలపు వల విసరుతున్నారు. సామాజిక మాధ్యమాలు.. పబ్‌లు.. రేవ్‌పార్టీలు.. డేటింగ్‌యాప్‌లు..ఆన్‌లైన్ వివాహ పరిచయ వేదికలను అనువుగా మలచుకొని తేలికగా బురిడీ కొట్టిస్తున్నారు. బుక్కయ్యామని గుర్తించేలోపే దొరికినంత సొమ్ము గుంజి ఝలక్ ఇస్తున్నారు. బయటకు చెబితే పరుతు పోతుందని.. ఇంట్లో తెలిస్తే కాపురం కొల్లేరవుతుందనే భయంతో బాధితులు మౌనం వహిస్తున్నారు. నగరంలో ఎక్కువ మంది డేటింగ్‌యాప్‌లు, మ్యాట్రిమోనీ సైట్ల ద్వారానే మోసపోతున్నట్టు పోలీసులు హెచ్చరిస్తున్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినపుడే ఇటువంటి ఆగడాలకు కళ్లెం వేయగలమని సూచిస్తున్నారు.

**నమ్మారో.. బుక్కయినట్టే**

ఇటీవల మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో నకిలీ ప్రొఫైల్స్ ఉంచి.. అబ్బాయిలను పెళ్లి పేరిట మోసగిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివాహ పరిచయ వేదికల్లో పరిచయమైన యువకుల నుంచి ఫోన్ నంబర్లు తీసుకొనేవారు. ఇద్దరు యువతులకు కమీషన్ ఇస్తామని ఆశచూపి వారిని వధువులుగా పరిచయం చేయించేవారు. తమ పుట్టిన రోజంటూ బహుమతులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో ఉన్నారంటూ నగదు కాజేసేవారు. పెళ్లిప్రస్తావన వచ్చాక ముఖం చాటేసేవారు. అట్నుంచి గట్టిగా నిలదీస్తే లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేస్తామని బెదిరించేవారు. ఇలా సుమారు 50 మంది మోసపోయినట్టు పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. అర్ధరాత్రి దాటాక.. వాట్సాప్ వీడియోకాల్ చేసి సెక్స్‌టార్షన్‌తో బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. బాధితుల జాబితాలో మల్టీప్లెక్స్ యజమాని, విశ్రాంత ఐఏఎస్ అధికారి, సినీ నిర్మాత ఉన్నారు. ట్రయాంగిల్ లవ్‌స్టోరీలో ఒక యువతి మాజీ ప్రేమికుడి కారులో డ్రగ్స్ ఉంచి పోలీసులకు పట్టిచ్చింది. అతడ్ని వదిలించుకునేందుకు మాయలేడీ ఆ పనిచేసినట్టు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు.

**వీరంతా ఎవరో తెలుసా...!** ఉద్యోగావకాశాల కోసం ఎంతోమంది యువతులు నగరానికి చేరుతుంటారు. కుటుంబం నడిపేందుకు.. పిల్లల ఫీజులకు, ఖర్చుల కోసం 'కిరాయి మనుషులు'గా మారుతున్నారు. ఇటీవల బంజారాహిల్స్ ఠాణా పరిధిలోని పబ్‌లో పట్టుబడిన 42మంది మహిళల్లో నలుగురు గృహిణిలున్నారు. వారిలో ఒక మహిళకు 4 నెలల కుమార్తె ఉంది. భర్త ఆదరణకు దూరమైన ఆమె ఆర్థిక ఇబ్బందులు అధిగమించేందుకు పబ్ నిర్వాహకులు ఇచ్చే రూ.2వేల కోసం మగవారితో మాటలు కలిపి బిల్లులు పెరిగేలా చేసేందుకు అంగీకరించినట్టు వాపోయారు. ఉత్తరాది నుంచి వచ్చిన యువతి స్పా సెంటర్‌లో పనిచేస్తుంది. వచ్చే ఆదాయం, అద్దెలు, ఖర్చులకు సరిపోతున్నాయి. తల్లిదండ్రులకు డబ్బు పంపేందుకు ఇలా చేస్తున్నానంటూ పోలీసులకు వివరించింది.

# వీడీసీల అండగా.. దందాల జోరు



మెట్‌పల్లి : పల్లెల్లో అక్రమ దందాలు జోరుగా సాగుతున్నాయి. గ్రామాభివృద్ధి కమిటీల(వీడీసీ)ను ఏర్పాటు చేసుకొని ఇసుక, మద్యం, మట్టి, రాళ్లు వంటి అక్రమ కార్యకలాపాలకు వేలం పేరుతో అనధికార అనుమతులు జారీ చేస్తూ భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధితశాఖల అధికారులు తమకేమీ పట్టనట్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. అక్రమ దందాలతో గ్రామాల్లో గొడవలు చోటుచేసుకుంటున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్ల పరిధిలోని గ్రామాల్లో అనధికార కమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అభివృద్ధి పేరుతో నిబంధనలను తుంగలో తొక్కుతూ అక్రమ దందాలకు దన్నుగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా వాగులు, కాలువల వెంట ఉన్న గ్రామాలు, గోదావరి శివారు గ్రామాల్లో వేలం నిర్వహిస్తూ ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్నాయి. ఇటీవల వరద కాలువలో ఇసుక నిల్వలు పేరుకుపోవడంతో వేలం నిర్వహిస్తున్నారు. ఒకవైపు జిల్లా కలెక్టర్ ఇసుక అక్రమ రవాణాపై ఆగ్రహంతో ఉన్నప్పటికీ గ్రామాల్లో మాత్రం వేలం పాటలు ఆగడం లేదు. గతంలో కొన్ని రోజులు పోలీసులు ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకున్నప్పటికీ ఇటీవల రాజకీయ ఒత్తిడితో మిన్నకుండిపోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో వాగులు, వంకల నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. వరద కాలువ వెంబడి ఉన్న గ్రామాల్లో కాలువ ఒడ్డున పోసిన మట్టి నుంచి రాళ్ల తరలింపునకు వేలం వేయడం గమనార్హం. ఇవే కాకుండా మద్యం గొలుసు దుకాణాల నిర్వహణకు వేలం పాటలు నిర్వహిస్తున్నారు. ఏడాదికి, నెలకు అంటూ పెద్ద మొత్తం నిర్ణయించి కొనసాగిస్తున్నారు. ఆదేశాలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించడానికి వెనుకాడడం లేదు. ఇటీవల మెట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఓ గ్రామంలో మద్యం గొలుసు దుకాణాలను మూసివేయాలని గోడ ప్రతులు వెలిసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే ఓ గ్రామంలో డీజే విషయంలో గ్రామాభివృద్ధి కమిటీ, మరి కొంత మందికి వివాదం ఏర్పడగా, ఇద్దరికి జరిమానా విధించిన విషయం పోలీసుల వరకు వెళ్లింది. దీన్ని బట్టి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

కోరుట్ల మండలంలోని ఓ పెద్ద గ్రామంలో రెండు నెలల కిందట నాలుగు గొలుసు మద్యం దుకాణాల నిర్వహణకు ఒక్కో దుకాణదారుడు రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.8 లక్షలు వీడీసీకి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పోలీస్‌స్టేషన్ వరకు చేరింది. పోలీసులు వీడీసీ సభ్యులు, మద్యం విక్రయదారులను పిలిపించి మందలించి పంపించారు. మరోమారు ఇలా చేస్తే బైండోవర్ చేస్తామని హెచ్చరించారు.కోరుట్ల మండలంలోని ఓ గ్రామంలో సుమారు 30 ఇసుక ట్రాక్టర్లు ఉంటాయి. వారు పక్కమండలంలోని రెండు గ్రామాల పరిధిలోని వాగులో అక్రమంగా ఇసుక తవ్వకాలు కొన్నేళ్లుగా చేపడుతున్నారు. వాగు ఒడ్డునున్న స్థలాలు కుల సంఘాలకు చెందినవని వారికి లక్షల్లో నగదు ముట్టజెప్పి ఇసుకను తవ్వి యథేచ్ఛగా తరలిస్తున్నారు.

మల్లాపూర్ మండలంలోని ఓ గ్రామంలోని పెద్దవాగులో అక్రమ ఇసుక తవ్వకాలు, మద్యం విక్రయాలకు రూ.6.50 లక్షలకు వీడీసీ సభ్యులు వేలం నిర్వహించినట్లు తెలిసింది. సదరు వాగులోని ఇసుకను తీసుకునేందుకు ఇటీవల జిల్లా అధికారులు ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ అదేచోట అక్రమంగా ఇసుకను తవ్వేందుకు వేలం నిర్వహించడం గమనార్హం.

కోరుట్లను ఆనుకొని ఉన్న ఓ గ్రామంలో వాగులో ఇసుక తవ్వకాలకు గతేడాది ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1.50 లక్షలు చెల్లించగా, ప్రస్తుత ఏడాది సైతం అంతే మొత్తంలో చెల్లించాలని నిబంధనలు విధించారు.

మెట్‌పల్లి మండలంలోని పెద్దవాగు వెంట ఉన్న ఓ గ్రామంలో రూ.8.60 లక్షలకు ఇసుక వేలం నిర్వహించినట్లు తెలిసింది.

మెట్‌పల్లి మండలంలోని ఓ గ్రామంలో పెద్దవాగు, వరద కాలువలో ఇసుక రవాణాకు రూ.26 లక్షలకు వేలం వేసినట్లు సమాచారం.

కథలాపూర్ మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల మద్యం విక్రయాలకు వేలం వేశారు. మరో గ్రామంలో వాగులో ఇసుకను తవ్వుకునేందుకు ట్రాక్టర్‌కు రూ.వేలల్లో చెల్లించాలని, మరో గ్రామంలో మద్యం విక్రయ దుకాణానికి రూ.50వేలు చెల్లించాలనే నిబంధనలు విధించినట్లు సమాచారం.

# ప్రధాన సమస్యల పరిష్కార బాట

గోదావరిఖని : తెలంగాణ పట్టణ ఆర్థిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ(టి.యు.ఎఫ్.ఐ.డి.సి.) విడుదల చేసిన రూ. 20 కోట్లతో రామగుండం నగరపాలక ప్రాంతంలోని ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయి. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రత్యేక శ్రద్ధ వహించి టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధుల విడుదల కోసం తీవ్రంగా కృషి చేశారు. దీంతో గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో నెలకొన్న ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోనున్నాయి. గతంలో కేటాయించిన నిధులు సరిపోకపోవడంతో అర్ధాంతరంగా ఆగిపోయిన రహదారులు, మురుగు కాలువల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవడంతో తమ ఇబ్బందులు తీరతాయని స్థానికులు భావిస్తున్నారు.

**సమస్యల పరిశీలన...**

నగరంలో పెండింగ్‌లో ఉన్న, అర్ధాంతరంగా ఆగిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు ఆయా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. గోదావరిఖనిలోని అగ్నిమాపక కేంద్రం సమీపంలో శివాలయం వైపునుంచి, ప్రభుత్వ ఆసుపత్రి వైపు నుంచి రోడ్డు నిర్మాణం పూర్తికాగా నిధులు సరిపోలేదంటూ మధ్యలో కొంత మేరకు రోడ్డు నిర్మాణం వదిలేసి సంవత్సరాలు గడచినా పాలకవర్గం, అధికారులు పట్టించుకోలేదు. దీనిపై పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. తాజాగా నగరపాలక ఈఈ రామన్ దృష్టికి సమస్య వెళ్లడంతో రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. ఇదే తరహాలో



గోదావరిఖని మార్కండేయకాలనీ ప్రధాన రహదారి నుంచి ఓ ప్రైవేటు పాఠశాల మీదుగా చంద్రబాబునాయుడు కాలనీ వైపునకు వెళ్లే ప్రధాన రహదారిలో భూగర్భ మురుగు కాలువ నిర్మించారు. రోడ్డు నిర్మాణం కోసం దొడ్డు కంకర వేశాక నిధులు సరిపోలేదని వదిలేశారు. తాజాగా టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధులతో ఈ రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నారు. ఇదే తరహాలో మార్కండేయకాలనీలో మురుగు కాలువ నిర్మాణం నిలిచిపోగా రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. చినుకు పడిందంటే అడుగుపెట్టేందుకు వీలులేకుండా బురదమయమయ్యే దుర్గానగర్ ప్రాంతంలోని ప్రధాన, అంతర్గత రోడ్డు నిర్మాణం పనులను పూర్తి చేశారు.

**త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు- రామన్, రామగుండం నగరపాలక ఈఈ** గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నిలిచిపోయిన అభివృద్ధి పనులతో పాటు అత్యవసరమైన అభివృద్ధి పనులపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నాం. నగరంలోని అన్ని డివిజన్లలో ఇలాంటి సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఎమ్మెల్యే, మేయర్, పాలకవర్గం, ఉన్నతాధికారుల సూచనలు, సమన్వయంతో రామగుండంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నాం.

# వీటీఏడీఏ.. జిల్లా అంతటా విస్తరణ!

సిరిసిల్ల : వేములవాడ ఆలయ అభివృద్ధికి ఏర్పాటు చేసిన వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) పరిధి జిల్లా అంతటికీ విస్తరించింది. 2016 ఫిబ్రవరిలో ఏర్పాటైన వీటీఏడీఏ కార్యాలయం 2023 ఆగస్టు వరకు హైదరాబాద్‌లోనే ఉంది. ఏడేళ్లలో రూ.450 కోట్లతో ప్రణాళికలు రూపొందించినా ఆశించిన స్థాయిలో ఆలయ అభివృద్ధి జరగలేదు. గత ప్రభుత్వ హయాంలో రూ.77 కోట్లు ఖర్చయ్యాయి. వీటిలో రూ.9.26 కోట్లు అందులో పని చేసే పొరుగుసేవల ఉద్యోగుల జీతభత్యాలు, కార్యాలయం అద్దెకు చెల్లించారు. మిగతావి గుడిచెరువు విస్తరణకు అవసరమైన భూసేకరణకు పరిహారం చెల్లించారు. ప్రస్తుతం దీని పరిధిని సిరిసిల్ల, వేములవాడ రెండు పురపాలికలతోపాటు 152 రెవెన్యూ గ్రామాలతో జిల్లా అంతటా విస్తరించారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులను అధికంగా రాబట్టుకోవడంతోపాటు ఇళ్ల నిర్మాణం వంటి సంక్షేమ పథకాల్లో భారీగా ప్రజలకు లబ్ధి చేకూరే అవకాశం ఉంటుంది.

**ప్రయోజనాలు ఇలా**

వీటీఏడీఏ ప్రత్యేక స్వయం ప్రతిపత్తి సంస్థగా మారింది. దీనికి నేరుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు మంజూరవుతాయి.

ఛైర్మన్, వైస్ ఛైర్మన్ తీర్మానంతో ఆయా గ్రామాల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించే అవకాశం ఉంటుంది. గ్రామాలు, పట్టణాల్లో రహదారులు, కేంద్రీయ విద్యుత్ దీపాలు, పార్కులు, అంతర్గత రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలకు నేరుగా నిధులు వెచ్చించవచ్చు.

లేఅవుట్ల అభివృద్ధితోపాటు పంచాయతీల్లో భవన నిర్మాణాలకు ప్రస్తుతం జీం2 వరకు మాత్రమే అనుమతి ఉంది. పరిధి విస్తరణతో జీం5 వరకు వీటీఏడీఏ అనుమతులు ఇవ్వనున్నది. పురపాలికలు, గ్రామాల పాలకవర్గాలకు అనుసంధానంగా పని చేస్తుంది.

చేపడుతున్న పనులు

దేశంలోనే అతిపెద్ద శైవక్షేత్రం వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు ఏటా కోటికిపైగా భక్తులు వస్తుంటారు. వీటీఏడీఏ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటికీ రూ.90 కోట్ల మేరకు పనులు పూర్తయ్యాయి.

ప్రస్తుతం రూ.12 కోట్లతో గుడిచెరువు పార్కు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో రూ.2 కోట్లతో నిర్మించిన పార్కు పనులు పూర్తయ్యాయి. పార్కింగ్ ప్రాంతంలో శివార్చన వేదిక పనులు చివరి దశలో ఉన్నాయి.

రూ. 10 కోట్లతో బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు ఇటీవలే ప్రారంభమయ్యాయి. రహదారులు, భవనాలశాఖ పరిధిలో అసంపూర్తిగా ఉన్న పనులు జరగాల్సి ఉంది. దీనిలో ప్రధానంగా కోరుట్ల ప్రధాన రహదారి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు అంతర్గత రహదారుల నిర్మాణం ప్రారంభం కావాల్సి ఉంది.

జగిత్యాల బాహ్యవలయ రహదారి పక్కన బస్‌స్టేషన్ నిర్మాణానికి గతంలో 20 ఎకరాల సేకరణకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ భూసేకరణకు సంబంధించి నిర్వాసితులకు పరిహారం పంపిణీ చేయాల్సి ఉంది.

తిప్పాపూర్ బస్టాండ్ కూడలి నుంచి ఆలయం ముందు వరకు రహదారి విస్తరణకు గతంలో రూ.35 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. కాగా అసంపూర్తి వంతెన నిర్మాణం, పరిహారం కోసం దీనిని రూ.50 కోట్లకు పెంచేందుకు నిర్ణయించారు. ఇక్కడ భూసేకరణ కొలిక్కిరావాల్సి ఉంది.

**సిబ్బంది నియామకం?**

పరిపాలన సౌలభ్యం కోసం వీటీఏడీఏను 2023 ఆగస్టులో వేములవాడకు మార్చారు. ప్రస్తుతం రాజరాజేశ్వరి అమ్మవారి అతిథి గృహం మొదటి అంతస్తులో కార్యాలయం ఏర్పాటు చేశారు. దీనిలో కార్యదర్శి, ముఖ్య ప్రణాళిక అధికారి, ఎస్టేట్ అధికారితోపాటు వివిధ విభాగాల్లో 14 మంది కార్యాలయ సిబ్బంది ఉండాలి. కార్యాలయం వేములవాడకు మార్చిన తరవాత కార్యదర్శి మినహా ఎవరూ లేరు. పరిధి విస్తరణతో హెచ్ఎండీఏ (హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ) తరహాలో ఇక్కడ కూడా శాఖల వారీగా ఉద్యోగులను నియమించనున్నారు.

## పని ఒకటే.. మూడుసార్లు తవ్వేశారు

హైదరాబాద్ : ఒకటే పని.. పదే పదే చేయడంలో శాఖల మధ్య సమన్వయం లేదని స్పష్టమవుతోంది. అయినా అధికారుల్లో చలనం లేదు. డబ్బు, సమయం వృథా అవుతున్నా కిమ్మనడం లేదు. ప్రణాళిక లోపాన్ని సరిచేసే పని చేయడం లేదు. అడ్డగోలు పనులతో ట్రాఫిక్ స్తంభించి సామాన్యులు నరకం చూస్తున్నారు.

ఇదీ కారణం: రేతిబౌలి చౌరస్తాలో భూగర్భ విద్యుత్తు కేబుళ్లను వేయడానికి పద్ధతి లేకుండా పనులు చేయడంతో ఇరుకైన దారిలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది.

ప్రధాన మార్గమిది..: నగరం నుంచి గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట ఐటీ కారిడార్‌కు వెళ్లేందుకు ఎక్కువ మంది రేతిబౌలి మార్గాన్ని ఉపయోగిస్తుంటారు.

మెహిదీపట్నం, రేతిబౌలి, నానల్‌నగర్ చౌరస్తా దాటితే చాలు ఫ్లైఓవర్ల మీదుగా రాయదుర్గం వరకు వేగంగా చేరుకోవచ్చు.

చేపడుతున్న పని : మెహిదీపట్నం పీవీ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెంబరు 38 నుంచి నానల్‌నగర్‌లోని అసిఫ్‌నగర్ ఉపకేంద్రం వరకు అరకిలోమీటర్ దూరం ట్రాన్స్‌కో 132 కేవీ భూగర్భ కేబుల్ వేసేందుకు



తవ్వకాలు చేపట్టింది.

**అప్పుడు సగం.. ఇప్పుడు సగం..**

సీతారాంబాగ్‌లో నిర్మించిన ఉపకేంద్రానికి అసిఫ్‌నగర్ నుంచి భూగర్భ కేబుల్ వేయాలి. ఏళ్ల తరబడి ట్రాన్స్‌కో నత్తనడకన పనులు చేస్తోంది. 5 కి.మీ.పనిలో 3.5 కి.మీ. ఏడాది కిందటే పూర్తైంది. మిగిలిన 1.5 కి.మీ.లో రహదారి తవ్వకానికి అనుమతులు ఆలస్యం కావడంతో ఈ ఏడాది ఆరంభంలో కిలోమీటర్ పని పూర్తి చేశారు. ఇక మిగిలిన అరకిలోమీటర్ పని చేయడానికి ఆపసోపాలు పడుతున్నారు. డిసెంబరు నాటికి పూర్తి చేయాలని హడావుడిగా మళ్లీ రోడ్డు తవ్వకం మొదలెట్టారు. ఇలా ఒకటే పనికి మూడుసార్లు రోడ్డు తవ్వేసి ట్రాన్స్‌కో ప్రజలను ఆగమాగం చేస్తోంది.

# బియ్యం నిల్వలు నిండుకున్నాయి!




సిరిసిల్ల : నిరుపేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం నిల్వలు నిండుకున్నాయి. లబ్ధిదారులు నిత్యం రేషన్ దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మండల గిడ్డంగులు (స్టాక్ పాయింట్)లలో సరిపడినంత నిల్వలు లేకపోవడం పంపిణీ ఆలస్యం కావడం ఒక కారణం. ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే బియ్యం నిల్వల కోసం అధికారులు రిజర్వేషన్ ఆఫ్ ఆర్డర్ (ఆర్వో)ను నివేదించే సమయంలో జరిగిన ఆలస్యం.. పంపిణీపై పడటం మరో కారణం. జిల్లాలో పరిస్థితిపై కథనం.

**566 దుకాణాలు.. 4,454 మెట్రిక్ టన్నులు**

జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో పంపిణీ చేయగా, మిగిలిన బియ్యం ఎంత? కావాల్సిందెంత డీలర్ ఇండెంట్ రూపంలో అధికారులకు అందిస్తారు. ఇలా జిల్లావ్యాప్తంగా 566 దుకాణాలకు 4,454 మెట్రిక్ టన్నుల బియ్యం కావాలని ప్రభుత్వానికి ఆర్వో (రిజర్వేషన్ ఆఫ్ ఆర్డర్) ఇచ్చారు కానీ.. ఈసారి ఆర్వో జారీలో ఆలస్యమైంది.

ప్రతి నెలా 20 నుంచి 30వ తేదీ వరకు మండల గిడ్డంగుల నుంచి బియ్యాన్ని రేషన్ దుకాణాలకు పంపిణీ చేయాలి. ఆర్వో ఆలస్యంతో పంపిణీలో జాప్యం జరిగింది. ఈ నెల 3వ తేదీ నాటికి 77 శాతం బియ్యాన్ని దుకాణాలకు పంపిణీ చేశారు.కరీంనగర్ గిడ్డంగి పరిధిలో 263 దుకాణాలకు 2274 మె.ట.ల బియ్యాన్ని ఆన్‌లైన్‌లో అనుమతి ఇస్తే, 178 దుకాణాలకు 1549 మె.ట. సరఫరా చేశారు. ఇంకా 85 దుకాణాలకు 725 మె.ట.పంపిణీ చేయాల్సి ఉంది.

ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకు ఆయా దుకాణాల్లో పాత నిల్వలను పంపిణీ చేశారు. నిల్వలు నిండుకోవడంతో బియ్యం లేవంటూ బోర్డులు పెట్టారు.

నగరంలో శనివారం వరకు పలు దుకాణాల్లో పంపిణీ చేయలేదు. శనివారం ఉదయం నాటికి అధికారులు దుకాణాదారులకు బియ్యం అందించినట్లు సమాచారం.

చొప్పదండి పరిధిలో 99 దుకాణాలకు (మొత్తం 106) నిల్వలు సకాలంలో అందించారు. హుజూరాబాద్‌లో 86 దుకాణాలకు (మొత్తం 103) బియ్యం అందుబాటులో పెట్టారు. జమ్మికుంట పరిధిలో 68 దుకాణాలకు (మొత్తం 94) బియ్యం అందించగలిగారు. బియ్యం నిల్వలులేని దుకాణాలు నో స్టాక్ అంటూ బోర్డు పెట్టి మూసేశారు.

**ఇప్పటికీ 18 చోట్లకు అందలేదు**

జిల్లాలో 548 దుకాణాలకు బియ్యం రవాణా చేయగలిగారు. ఇంకా 18 దుకాణాలకు 158 టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయాల్సి ఉందని అధికారుల తెలిపారు. చిగురుమామిడి-1, కొత్తపల్లి-1, మానకొండూర్-11, తిమ్మాపూర్-2, కరీంనగర్ రూరల్‌లో మూడు దుకాణాలకు ఇంత వరకు అందలేదు. కరీంనగర్ మండల గిడ్డంగిలో నిల్వలు లేకపోవడంతో జమ్మికుంట గిడ్డంగిలో మిగులు బియ్యాన్ని తీసుకొచ్చే ప్రయత్నంలో అధికారులు ఉన్నారు. జమ్మికుంట నుంచి రాగానే పంపిణీ చేస్తామని కరీంనగర్ మండల గిడ్డంగి అధికారి ఖాదర్ తెలిపారు.

## తెల్లని గీతలు.. వెన్నెముక కుదేలు

హైదరాబాద్ : వాహనదారుల జీవితాల్లో రహదారులపై ఏర్పాటు చేసిన రంబుల్ స్ట్రిప్స్(రహదారిపై అడ్డుగా వేసే తెల్ల గీతలు) చీకటిని నింపుతున్నాయి. ద్విచక్ర వాహనదారుల పరిస్థితి దారుణంగా మారింది. వాటి మీదుగా ప్రయాణిస్తున్నప్పుడు క్షణాల్లో ద్విచక్ర వాహనం పది నుంచి 20 సార్లు కుదుపునకు గురవుతుండటంతో వాహనదారులు, అందులో కూర్చున్న వారి వెన్నుపూస దెబ్బతింటోంది. కార్లు, ఇతర భారీ వాహనాలు సైతం దెబ్బతింటున్నాయి. రహదారులపై గుంతలు కూడా పడుతున్నాయి. దీనిపై జీహెచ్ఎంసీకి నిత్యం ఫిర్యాదులొస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

**నిషేధం విధించినప్పటికీ..**

వరుస ఫిర్యాదులతో అప్పటి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ రంబుల్ స్ట్రిప్స్‌పై స్పందించారు. కొత్తగా ఏర్పాటు చేయొద్దని బల్దియాను ఆదేశించారు. నాటి ఇంజినీర్ఇన్ చీఫ్ జియాఉద్దీన్ మే 16, 2023న మెమో జారీ చేస్తూ కొత్తగా రంబుల్ స్ట్రిప్స్‌ను ఏర్పాటు చేయొద్దంటూ ఇంజినీర్లకు స్పష్టంచేశారు.



**కొన్ని చోట్ల పది వరుసల్లో..**

ప్రైవేటు గుత్తేదారు సంస్థల నిర్వహణలోని సీఆర్ఎంపీ(కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రామ్) రోడ్లపై, పైవంతెనలు, ఇతర రహదారులపై కొన్ని నెలలుగా రంబుల్‌స్ట్రిప్స్ ఇష్టానుసారంగా నిర్మాణమవుతున్నాయి. ఉప్పల్ నుంచి పంజాగుట్ట చౌరస్తా వరకు ప్రతి అరకిలోమీటరుకు ఓ రంబుల్ స్ట్రిప్ ఏర్పాటైంది. ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ సర్కిల్ కూడలికి ఇరువైపులా, ఉప్పల్ క్రికెట్ స్టేడియం రోడ్డు, ఎన్‌జీఆర్ఐ, హబ్సిగూడ, తార్నాక మధ్య దాదాపు ప్రతి 200ల మీటర్లకు ఒకదాన్ని ఏర్పాటు చేశారు. బయోడైవర్సిటీ కూడలి షేక్‌పేట, రోడ్డు నెం.45 పైవంతెన, ఎల్బీనగర్‌లోని పైవంతెనలు, కూకట్‌పల్లి జాతీయ రహదారికి ఇరువైపులా దాదాపు 30చోట్ల రంబుల్‌స్ట్రిప్స్ ఉన్నాయి.

**ప్రమాదాల నివారణకే అంటున్న ఇంజినీర్లు..** ఐఆర్‌ఎస్(ఇండియన్ రోడ్ కాంగ్రెస్) నిబంధనల ప్రకారం వాహనాల వేగాన్ని నియంత్రించడానికి రంబుల్ స్ట్రిప్స్ ఉపయోగించవచ్చని ఇంజినీర్లు చెబుతున్నారు. అవి 2.5మి.మీ నుంచి 15మీ.మీ ఎత్తుతో ఉండాలి. వరుసలు, వరుసల మధ్య దూరం కూడా ప్రమాణాలకు లోబడి ఉండాలి. కానీ గుత్తేదారు సంస్థలు ఈ నిబంధనలేవీ పాటిం చడం లేదు.

## స్వశక్తి.. సాధికార దీప్తి

సిరిసిల్ల : కార్మిక, ధార్మిక క్షేత్రాల్లోని మహిళలు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మెప్మా ప్రత్యేకంగా దృష్టి సారించింది. వీరు స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు 'ఇందిరా మహిళా శక్తి' పథకాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని మహిళలు మెప్మా సహకారంతో వారు ఎంచుకున్న రంగంలో రాణిస్తున్నారు. కేవలం పొదుపునకే పరిమితమైన స్వశక్తి మహిళలు ఇప్పుడిపుడే వ్యాపారులుగా రాణించేందుకు పునాదులు వేస్తున్నారు. కూరగాయలు, కిరాణం, కర్రీ పాయింట్లు, బ్యూటీపార్లర్, ఫ్యాన్సీ స్టోర్లు, కంగన్‌హాళు తదితర వాటిని నిర్వహిస్తూ ఆర్థికాభివృద్ధిలో రాణిస్తున్నారు. సిరిసిల్ల పురపాలికలో ఇప్పటికీ ఇందిరా మహిళా శక్తిలో 92 స్వశక్తి సంఘాలు సంయుక్తంగా వ్యాపారాలు నిర్వహిస్తుండగా, వ్యక్తిగతంగా మరికొందరు రాణిస్తున్నారు. ఆయా స్వశక్తి సంఘాల ఆర్పీలు వీరికి ఎప్పటికప్పుడు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

జిల్లాలోని పట్టణాల్లో ఎక్కడ చూసినా కర్రీ పాయింట్లు కనిపిస్తున్నాయి. సిరిసిల్లలోని గాంధీ కూడలిలోని మహిళలు రుచికరమైన కూరలతో పాటు జొన్నరొట్టె, చపాతీలు చేసి విక్రయిస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. పట్టణానికి చెందిన ధోబీ గల్లీలోని సాయిబాబా సమాఖ్య



సభ్యులు శుభకార్యాలకు పిండి వంటలు చేయడంతోపాటు విదేశాలకు వెళ్లేవారికి పచ్చళ్లు, తయారు చేసి పంపుతుంటారు. అలాగే ఆలయాల్లో జరిగే ప్రత్యేక ఉత్సవాల సమయంలో ప్రసాదాలు కూడా తయారు చేస్తుంటారు. వీరు పట్టణంలోని రాళ్లబావి వద్ద తినుబండారాల విక్రయ దుకాణాన్ని కూడా ప్రారంభించారు. పోస్టాఫీసు వీధిలోని సాధన సమాఖ్య ఆధ్వర్యంలో వివాహాది శుభకార్యాలకు క్యాటరింగ్ చేస్తున్నారు.

**ప్రోత్సాహకరంగా ఉంది**

మహిళా సంఘంలో చేరి బ్యాంకు నుంచి పొందిన రుణంతో తొలుత ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయించేవాళ్లం. తర్వాత కరోనా సమయంలో శుభ్రతపై అందరికీ అవగాహన పెరిగింది. దీంతో శానిటైజర్, ఫినాయిల్ వంటివి తయారు చేసి విక్రయించాం. విదేశాలకు వెళ్లేవారు పిండి వంటలు, పచ్చళ్లు తయారు చేయించుకుని తీసుకెళ్తుంటారు. దీంతో మా సమాఖ్య ఆధ్వర్యంలో ఇటీవల పిండి వంటల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించాం.మనోరమ, ఆర్పీ

# నిర్వహణ కొరవడి.. అన్నదాతల్లో అలజడి



వేములవాడ : యాసంగి సాగుకు కాలువల నీరే ఆధారం. అటువంటి కాలువలు నిర్వహణ, పర్యవేక్షణ కొరవడి సమస్యల సుడిలో కొట్టుమిట్టాడుతున్నాయి. నిర్దేశించిన ఆయకట్టుకు నీరందక రైతాంగం ఏటా ఆందోళన చెందుతున్నా పట్టించుకున్న వారే కరవయ్యారు. యాసంగి సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఆయా కాలువల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాల్సిన అవసరం ఉంది. జిల్లాలోని కాలువల పరిస్థితిపై పరిశీలన కథనం.

**ఎగువ గ్రామాలకు ఏటా కన్నీరు**

ఎల్లంపల్లి ప్రాజెక్టులో భాగంగా నారాయణపూర్ జలాశయం నుంచి వేములవాడకు నిర్మాణం చేస్తున్న ప్రధాన కుడికాలువ పనులు ఏళ్లుగా సాగుతూనే ఉన్నాయి. దీంతో ఎగువ గ్రామాలకు సాగునీరు అందడం లేదు. ఫలితంగా వర్షాకాలంలో మాత్రమే పంటలు సాగు చేస్తూ యాసంగిలో భూములను బీడుగా వదిలేస్తున్నారు. గంగాధర మండలంలోని దాదాపు 16 గ్రామాల రైతులతోపాటు బోయినపల్లి, వేములవాడ నియోజకవర్గానికి సాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గంగాధర ప్రధాన కూడలిలో రహదారిని తవ్వి కాలువ పనులు చేపట్టాల్సి ఉండగా ముందుకు సాగడం లేదు.

గంగాధర ప్రధాన కూడలిలో రోడ్డును తవ్వి భూగర్భంలోంచి కాలువ తవ్వకానికి రూ. 8.50 కోట్లకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదల కాగానే మిగులు పనులు పూర్తి చేసి ఎగువ గ్రామాలకు సాగునీరు అందిస్తామని నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు.

**చివరి ఆయకట్టు ప్రశ్నార్థకం!**

హుజూరాబాద్ పరిధిలోని డీబీఎం 16 కాలువ 37.1 కి.మీ ఉంది. 41,112 ఎకరాల ఆయకట్టు ఉంది. పలు చోట్ల ఉప కాలువలు, కాలువ లైనింగ్ దెబ్బతిన్నాయి. మరికొన్ని చోట్ల షిల్ట్ పెరిగి పోయింది. కాలువ లైనింగ్‌పై మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. నీటి ఫ్లో తక్కువగా ఉంటే 7 కి.మీ వరకు సుమారు 7 వేల ఎకరాల వరకు నీరందటం కష్టంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. డీబీఎం-15 కాలువ పరిధిలో వీణవంక, బేతిగల్, కనపర్తి గ్రామాల్లోని చివరి ఆయకట్టుకు సుమారు వెయ్యి ఎకరాల వరకు సాగునీరందటం లేదు.

నీటి విడుదల సమయంలో 4 వేల క్యూసెక్కుల వరకు ఫ్లో ఉంటేనే చివరి ఆయకట్టు వరకు నీరందుతుంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డీఈ రాము పేర్కొన్నారు.

**కాలువలు ఇలా.. నీరందేదెలా?**

కరీంనగర్ నియోజకవర్గంలోని ఎస్సారెస్పీ కాలువలు పూడిక, నాచు, చెత్తాచెదారంతో నిండాయి. కొన్ని తూములు ధ్వంసమై ఉన్నాయి. డి-94, డి-93, మధ్యమానేరు కాలువ ద్వారా కరీంనగర్ నియోజకవర్గంలో దాదాపు 2 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాల్సి ఉంది. తీగలగుట్టపల్లి-వల్లంపహాడ్ గ్రామాల గుండా వెళ్లే డి-94 కాలువను మధ్యలో ధ్వంసమై చివరి ఆయకట్టుకు నీరు అందటం లేదు. రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి డివిజన్ల నుంచి మురుగునీరు నీరు డి-94 కాలువలోకి విడవటంతో నాచు పేరుకుపోయి, పిచ్చి మొక్కలు పెరిగాయి. ఎక్కువ నీటిని వదిలితే కట్ట తెగిపోతోంది.

కాలువలోకి నేరుగా మురుగు నీటిని వదలొద్దని నగర కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. నాచు, పిచ్చి మొక్కలు తొలగించాలని విజ్ఞప్తి చేశామని డివిజనల్ ఇంజినీర్ సంతోశ్‌కుమార్ తెలిపారు.

**కానరాని మరమ్మతులు**

మానకొండూర్ నియోజకవర్గంలోని ఎస్సారెస్పీ ఉప కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. కేశవపట్నం శివారు డీబీఎం- 12ఏ ఉప కాలువ ద్వారా సుమారు 300 ఎకరాలకు సాగు నీరు అందాల్సి ఉండగా.. ఉప కాలువ గోడలు, లైనింగ్ దెబ్బతిన్నాయి. పచ్చునూర్ శివారు డీబీఎం-4ఎల్ ఉప కాలువ లైనింగ్ దెబ్బతింది. మరమ్మతు పనులు జరగక సాగు ప్రశ్నార్థకంగా మారింది. డీబీఎం-12ఏ ఉప కాలువ మరమ్మతుకు రూ. 8 లక్షల నిధులు మంజూరయ్యాయి. మిగతా మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని డీఈఈ కవిత పేర్కొన్నారు.

## అతి సుకుమారం తగదు సుమా..!

కొత్తగూడెం : ఇంటర్మీడియట్ చదువుకునే ఇద్దరు బాలికలు గత శుక్రవారం బలవన్మరణానికి పాల్పడ్డారు. వీరిలో ఒకరు ఇంట్లో వండి పెట్టే కూర విషయమై మనస్తాపం చెంది.. కన్నవారికి గర్భశోకం మిగల్చడం బాధాకరం. చిన్నపాటి సమస్యకే మరొకరు ఉరేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇలా తరచూ ఎవరో ఆత్మహత్యకు పాల్పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తమ పిల్లలు బాగా చదువుకుని ఉన్నత స్థానంలో నిలబడాలని తల్లిదండ్రులు కోరుకోవడం తప్పుకాదు. కానీ, జీవితంలో ఎదురయ్యే కష్టాలు, వాటిని ఎదుర్కొనేలా సన్నద్ధుల్ని చేయాలి. సెల్‌ఫోన్ కాలక్షేపాలకు బదులు.. పాఠశాలల్లో శారీరక శ్రమను కలిగించే కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని వ్యక్తిత్వ, మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గతంలో ఖాళీ సమయాల్లో, సెలవుల్లో పిల్లల్ని తల్లిదండ్రులు పొలం పనులకు, వ్యాపారాల వద్దకు వెంటబెట్టుకెళ్లేవారు. ఇప్పుడది నామోషీ అయింది. ఈ వ్యత్యాసం గ్రామీణ ప్రాంతాలతో పోల్చిచూస్తే పట్టణాలు, నగరాల్లో ఎక్కువగా ఉంది. రాన్రాను టీనేజర్లు సున్నిత మనస్కులుగా తయారవుతున్నారు.



ఫలితంగా చిన్నపాటి కష్టానికే తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్నారు. 'విద్యా స్థితి నివేదిక-2023' ప్రకారం.. ఉమ్మడి జిల్లాలోని బాలురలో 63.1 శాతం, బాలికల్లో 49.3 మంది నెలలో 15 రోజుల పాటు కుటుంబ వ్యవసాయ, చిరువ్యాపారాల్లో పెద్దలకు సాయపడుతున్నట్లు తేలింది.

ఏదేమైనా యుక్త వయస్కుల వైఖరుల్లో మార్పు తెచ్చేందుకు ఇళ్లల్లో, పాఠశాలల్లో తగిన ప్రయత్నం జరగాలన్నది మానసిక వైద్య నిపుణుల మాట. జాతీయ సేవా పథకం, నేషనల్ క్యాడెట్ కార్ప్స్ విభాగాల్లో విద్యార్థులు పాల్గొనేలా చూడాలి. స్కౌట్స్, గైడ్స్‌లో చేరిన వారికి విజ్ఞానాంశాలతో పాటు శరీర దృఢత్వానికి సాధన చేయిస్తారు. 3, 4, 5వ తరగతుల పాఠ్యాంశాల్లో భాగంగా 'ఇంట్లో తల్లిదండ్రులకు పిల్లలు ఎలా ఆసరాగా నిలవాలి? వాటి ప్రయోజనం ఏమిటో' ఉపాధ్యాయులు బోధించాలి. శ్రమ, కష్టం గురించి తెలియజెప్పాలి. అప్పుడే భవిష్యత్తులో ఒడుదొడుకులు తట్టుకోగలుగుతారు. గురుకులాలు, వసతిగృహాల్లో ఉండేవారైతే తమ పనులన్నీ స్వయంగా చక్కబెట్టుకోవడం అలవాటవుతుంది. ఇంటి పనుల్లో సాయపడేలా, తమ గదులను వారే శుభ్రం చేసుకొనేలా, పుస్తకాలు సర్దుకొనేలా చూడటం.. సరకులు, కూరగాయలకు పంపడం.. బడుల్లో మొక్కల పెంపకం బాధ్యతలు అప్పగించడం.. వ్యవసాయ, వ్యాపార పనుల్లో పెద్దలకు సహరించే అలవాట్లు నేర్పిస్తే సమస్యలను ఎదుర్కొనే వైఖరుల్లో మార్పులొస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. 'మాది.. పాల్వంచ మండలం కోడిపుంజులవాగు గ్రామం. మా కుటుంబానికి పదెకరాల వ్యవసాయం ఉంది. నేనొక్కడినే కుమారుణ్ని. పట్టణంలోని వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్నా. గత దసరా, దీపావళి సెలవుల్లో ఇంటికొచ్చినప్పుడు పత్తి, మిరప చేలల్లో అమ్మానాన్నలతో కలసి అన్ని పనులు చేశా. కష్టం విలువ తెలిస్తే జీవితంలో బాగుపడతావని పెద్దవాళ్లు చెబుతుండటం మరిచిపోలేను'.పాల్వంచకు చెందిన 9వ తరగతి విద్యార్థి మాటలివీ..

'మాది ఖమ్మం నగరం. అమ్మానాన్నలు బస్టాండ్ సమీపంలో బజ్జీల బండి నడుపుతారు. మేం ఇద్దరు పిల్లలం. 8, 10వ తరగతి చదువుతున్నాం. సెలవు రోజులు, ఖాళీ సమయాల్లో దుకాణం వద్దకు వచ్చి సాయంగా ఉంటాం. సరకులు తెచ్చిస్తాం. అమ్మానాన్నలకు కాసేపైనా మా వల్ల ఉపశమనం కలగడం సంతోషంగా ఉంది. వాళ్లు మా కోసం పడే కష్టాన్ని చూసి ప్రేరణ పొందుతాం'.

ఖమ్మం నగరానికి చెందిన 8వ తరగతి బాలిక మనోగతం

శారీరక, మానసిక దృఢత్వం అవసరం

చాలావరకు విద్యాలయాల్లో మైదానాలు లేకపోవడంతో పిల్లలు ఆటలకు దూరమవుతున్నారు. చదువుతో పాటు తల్లిదండ్రులకు సహాయం చేసే పిల్లలకు పెద్దలతో సంబంధాలు బలపడతాయి. ఇది వారిలో ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుంది. చెడు స్నేహాలకు దూరంగా ఉంటారు. ఏకాగ్రత పెరిగి చదువుల్లో రాణిస్తారు. వీరభద్రం, సైకాలజిస్ట్, పాల్వంచ

## కొత్త కాలనీలు.. సమస్యల లోగిళ్లు

తాండూరు : వాణిజ్య, వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందుతున్న తాండూరు పట్టణంలో కొత్తగా ఏర్పడుతున్న కాలనీలు సమస్యల లోగిళ్లుగా మారుతున్నాయి. పట్టణ పరిధిలో కొత్తగా ఏర్పడిన విఘ్నేశ్వర కాలనీ, మార్కండేయ నగర్, సాయి కాలనీ, శ్రీనివాస కాలనీ తదితర ప్రాంతాలలో కనీస మౌలిక వసతులు పూర్తి స్థాయిలో లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. తాగు నీటి సరఫరా, విద్యుత్, పారిశుద్ధ్యం, మురుగు నీటి వ్యవస్థ, అంతర్గత రోడ్లు వంటివి లేక పోవటంతో ఆయా కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలికంగా కర్రల మీద తీగలను ఏర్పాటు చేసుకుని కాలం వెళ్ల దీస్తున్నారు. తాగు నీటి సరఫరా వ్యవస్థ లేక పోవటంతో డబ్బాల నీళ్లను కొనుగోలు చేస్తున్నారు. అంతర్గత రోడ్లు లేక నాపరాతి ముక్కలతో తాత్కాలికంగా దారులు ఏర్పాటు చేసుకున్నారు. మురుగు కాల్వలు లేక ఇళ్ల నుంచి వస్తున్న నీరు రోడ్లపై పారుతోంది. దీంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఆయా కాలనీల్లో దాదాపుగా 10 నుంచి 15 వేల దాకా జనాభా నివసిస్తోంది. **పన్నులు చెల్లిస్తున్నా..** అభివృద్ధి జాడలేదు: కొత్తగా ఏర్పాటు అవుతున్న కాలనీల్లో నివాసం ఉంటున్న ప్రజలు ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నా అభివృద్ధి మాత్రం జరగటం లేదని స్థానికులు వాపోతున్నారు.

# మంజూరు సరే..ప్రారంభమెప్పుడు?

సారంగాపూర్: బీర్‌పూర్ మండలానికి మంజూరైన కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయం(కేజీబీవీ) సారంగాపూర్‌లోనే కొనసాగుతుండడంతో వసతులు సరిపోక బాలికలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ విద్యా సంవత్సరం నుంచి బీర్‌పూర్‌లో 6, 7 తరగతులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందుకు అనుగుణంగా బీర్‌పూర్‌లో విద్యాలయాన్ని ప్రారంభిస్తామని ప్రవేశాలను సారంగాపూర్ కేజీబీవీలో తీసుకొని తరగతులు కొనసాగించారు. ఇందుకు అనుగుణంగా విద్యాలయ ప్రత్యేకాధికారితోపాటు ముగ్గురు ఉపాధ్యాయినులను కూడా నియమించారు. అయితే విద్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు సరైన భవనాలు లేకపోవడంతో ఆరునెలలు గడిచినా సారంగాపూర్‌లోనే కొనసాగిస్తున్నారు. సారంగాపూర్‌లో గతేడాది వరకు ఆరు నుంచి పదోతరగతి వరకు కొనసాగగా ప్రస్తుతం ఇంటర్ వరకు పెంచడంతో దాదాపు 250 మందికి పైగా బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. దీనికి తోడు అదనంగా బీర్‌పూర్ కేజీబీవీ ఇక్కడే కొనసాగించడంతో వసతులు సరిపోకపోవడంతో అవస్థలు పడుతున్నారు. బీర్‌పూర్ మండల కేంద్రంలోని మోతీనగర్ ప్రాంతంలో పునరావాస గ్రామాలకు చెందిన పాఠశాల భవనం ఉన్నప్పటికీ సరైన వసతులు లేకపోవడంతో అధికారులు పరిశీలించి వదిలేశారు. ఇటీవల జిల్లా విద్యాధికారి మండలంలోని తుంగూర్‌లో ఓ అద్దె భవనాన్ని పరిశీలించి త్వరలోనే ప్రారంభిస్తామని ప్రకటించారు. ప్రారంభం ఆలస్యం కావడంతో సారంగాపూర్‌లో ఇబ్బంది పడాల్సి వస్తోందని బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే టీచింగ్ స్టాఫ్ నియామకం చేపట్టగా ప్రస్తుతం నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకాలు చేపడుతున్నారు. త్వరితగతిన బీర్‌పూర్‌లో విద్యాలయాన్ని ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థినులకు ఇబ్బంది లేకుండా

ఇప్పటికే తుంగూర్‌లో ఓ అద్దె భవనాన్ని ఉన్నతాధికారులు పరిశీలించి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకాలు చేపడుతుండగా పూర్తి కాగానే ఏర్పాటు చేసేలా చూస్తాం. విద్యార్థినులకు ఇబ్బంది లేకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నాగభూషణం, ఎంఈవో

# విదేశీ నోట్లు ఎర వేసి బురిడీ

హైదరాబాద్ : "మా వాళ్లు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మా వద్ద విదేశీ నోట్లున్నాయి. అత్యవసరం కావడంతో వాటిని తక్కువ ధరకు ఇస్తాం" అని అమాయకంగా ఎవరైనా అడగ్గానే భలేమంచి చౌకభేరమంటూ నమ్మారో.. అడ్డంగా బుక్కయినట్టే. నగరంలో విదేశీకరెన్సీ పేరిట కొన్ని అంతర్రాష్ట్ర ముఠాలు మోసాలకు తెగబడుతున్నాయి. వ్యాపారులు, ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని మాటలతో మభ్యపెట్టి అందినంత కొట్టేస్తున్నారు. తాజాగా సికింద్రాబాద్ పరిధిలో ఇద్దరినుంచి రూ.3లక్షలు కాజేసిన ముఠాలోని ముగ్గురు అరెస్టయ్యారు. పరారీలోని మరో ముగ్గురికోసం పోలీసులు గాలిస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన మాయగాళ్లు ముఠాలుగా ఏర్పడి నగరం, శివారు ప్రాంతాల్లో మకాం వేసినట్టు పోలీసులు గుర్తించారు.

ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కేటుగాళ్లు నాలుగైదు ముఠాలుగా ఎంచుకున్న నగరానికి చేరుతారు. ముఠాలో ఇద్దరు పురుషులు, ఒక మహిళ ఉంటారు. ఉద్యోగం, ఉపాధి కోసం వచ్చామంటూ స్థానికంగా తక్కువ అద్దెకు ఇల్లు దొరికే ప్రాంతాల్లో మకాం వేస్తారు. ఇదే తరహాలో ప్రస్తుతం



నగరంలో 6 అంతర్రాష్ట్ర ముఠాలు చేరినట్టు పోలీసులు అంచనా వేస్తున్నారు. సిటీబస్సులు, ఆటోల్లో తిరుగుతూ దుకాణాలు, ఉద్యోగులు, చిరువ్యాపారుల వద్దకెళ్లి విదేశీనోట్లను చూపుతారు. నమ్మకం కలిగించేందుకు వారి వద్ద ఉన్న అమెరికా, దుబాయ్, యూకే, సౌదీ దేశాలకు చెందిన నోటును బాధితుల చేతికిస్తారు. వాటిని బ్యాంకులు, మనీట్రాన్స్‌ఫర్ కేంద్రాల్లో చూపినా నిజమైన నోటేనంటూ నిర్ధారణ కావటంతో వీలైనంత పెద్దమొత్తంలో ఆ నోట్లను కొనుగోలు చేసేందుకు సిద్ధపడుతున్నారు.

**రద్దీ ప్రాంతాల్లోకి రప్పించాక**

విదేశీనోట్లను కొనేందుకు సిద్ధమైన వారిని వాటిని తీసుకునేందుకు జనసమ్మర్ధం ఉండే ప్రాంతాలకు రప్పిస్తారు. విదేశీనోటును పైభాగంలో ఉంచి లోపల తెల్లకాగితాలుంచుతారు. నోట్లకట్టగా నమ్మించేలా కాగితంలో చుడతారు. వాటిని బాధితుల చేతికిచ్చి అసలు నోట్లు తీసుకుంటారు. తమ కదలికలను పోలీసులు గమనిస్తున్నారని, పట్టుబడితే జైలుకెళ్లాల్సి వస్తోందంటూ భయపెడతారు. మోసపోయినట్టు గ్రహించాక బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. విదేశీ కరెన్సీ తీసుకోవటం నేరం కావటంతో కేసుల్లో ఇరుక్కుంటామనే భయంతో కొందరు వెనుకంజ వేస్తున్నారు.

**అంతర్రాష్ట్ర మాయగాళ్లతో జాగ్రత్త- టి.నర్సింగ్‌రావు, ఇన్‌స్పెక్టర్, రాంగోపాల్‌పేట్** విదేశీకరెన్సీని తక్కువ ధరకు ఇస్తామంటూ వచ్చే వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి. అత్యవసర ఖర్చుల కోసమే అమ్ముతున్నామని నిస్సహాయత ప్రదర్శిస్తారు. ఇలాంటి వారి మాయమాటలు నమ్మి మోసపోకండి. ఇప్పటికే ముఠా చేతిలో నష్టపోయినవారు ధైర్యంగా ఫిర్యాదు చేయండి.

# మందేసి మందిపైకి

హైదరాబాద్ : వయసుతో సంబంధం లేదు.. పోలీసులు తనిఖీ చేస్తారనే ఆలోచన లేదు.. కేసులు, జరిమానాలు, జైలుశిక్షల భయమే లేదు. మందుబాబుల అడ్డగోలు డ్రైవింగ్ ప్రజల ప్రాణాలమీ దకొస్తోంది. పూటుగా మద్యం తాగి రోడ్లుమీదకొస్తూ జనం ప్రాణాలు తీస్తున్నారు. పోలీసులు తనిఖీలు చేసి డ్రంకెన్ డ్రైవ్‌లో జరిగే ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్నా ఫలితం ఉండడం లేదు. ఏటా పోలీసులకు పట్టుబడే మందుబాబుల సంఖ్య పెరుగుతూనే ఉంది. లంగర్‌హౌస్‌లో తప్పతాగి కారు నడిపిన ఓ యువకుడు ఇద్దరి ప్రాణాలు బలితీసుకున్నాడు. నగరంలో ఈ తరహా రోడ్డు ప్రమాదాలు ఏటా వందల సంఖ్యలో జరుగుతున్నా పరిస్థితిలో మార్పురావడం లేదు. ఎక్కువగా యువతే.. మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలు చేసి.. వ్యక్తుల మరణానికి కారణమైనప్పుడు పోలీసులు కఠినసెక్షన్లు ప్రయోగిస్తున్నారు. బీఎన్‌ఎస్ 105 సెక్షన్ కింద నిందితుడిగా చేరుస్తున్నారు. డ్రంకెన్‌డ్రైవ్ కేసులు వారాంతాల్లో ఎక్కువసంఖ్యలో నమోదవుతున్నాయి. పట్టుబడే వారి వయసుల్ని విశ్లేషించినప్పుడు ఎక్కువగా 35 ఏళ్ల లోపు యువతే ఉంటున్నట్లు గుర్తించారు. కొందరికి రక్తంలో మద్యం మోతాదులు 400 మించి వస్తోంది. 15.04.2024: పూటుగా మద్యం తాగిన ఓ యువకుడు ఐటీ కారిడార్‌లో బీభత్సం సృష్టించాడు. అర్ధరాత్రి 12.30- 1.30 గంటల మధ్య ఆరు రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యాడు. ఇందులో 11 మంది గాయపడగా ఒకరు దుర్మరణం చెందారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా రక్తంలో మద్యం మోతాదు 550 వచ్చింది.

30.11.2024: వికారాబాద్‌కు చెందిన ఉద్యోగి మద్యంమత్తులో కారునడుపుతూ సన్‌సిటీ దగ్గర ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. స్థానికులు దేహశుద్ధి చేయడంతో తప్పించుకుని వస్తూ లంగర్‌హౌస్‌లో దంపతులు వెళ్తున్న



ద్విచక్రవాహనాన్ని, మరో రెండు ద్విచక్రవాహనాలను, ఆటోను ఢీకొట్టి ఆగింది. ఘటనలో దుర్మరణం చెందగా మరో ఐదుగురు గాయపడ్డారు.

**మత్తులో రైట్ రైట్**

నగ రంలో డ్రంకెన్ డ్రైవ్ కేసుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడినప్పుడు రక్తంలో మద్యం మోతాదును బట్టి జరిమానాలు, శిక్షలుంటున్నాయి. రూ.2 వేల జరిమానా నుంచి 5రోజుల వరకూ జైలుశిక్షలు విధిస్తున్నాయి. డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో నిందితుల నేపథ్యం పరిశీలించినప్పుడు 2022, 2023 సంవత్సరాల్లో దాదాపు 3 వేల మంది రెండోసారి పట్టుబడినవారే ఉన్నారు. గతేడాది మూడు కమిషనరేట్లలో కలిపి దాదాపు లక్ష కేసులు నమోదవగా ఈ ఏడాది 11 నెలల్లో ఈసంఖ్య 85 వేలకు చేరింది. ఏటా వేల మంది లైసెన్సులు రద్దు చేస్తున్నా మార్పు రావడం లేదు. కేసుల భయం ఉన్నా.. పోలీసు తనిఖీలు ఉండకపోవచ్చని, వేరేమార్గాల్లో ప్రయాణిస్తూ తప్పించుకోవచ్చనే ఉద్దేశంతో రోడ్ల మీదకు వస్తున్నారు. ఈ సమయంలో విచక్షణ కోల్పోయి వేగంగా దూసుకెళ్లాలన్న ఉద్దేశంతో ప్రమాదాల బారినపడుతున్నారు. మరికొందరు మద్యం మత్తులో నియంత్రణ కోల్పోయి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు.

# దారి తప్పుతున్న విద్యార్థి లోకం



పెద్దపల్లి: ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్మాణ దశలో ఉన్న భవనంలో గంజాయి తాగుతున్న విద్యార్థులను సదరు యాజమానులు పట్టుకొని.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అప్పగించారు. విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించి వదిలేశారు. ఈ వ్యవహారం బయటికి పొక్కకుండా సదరు పాఠశాల ఉపాధ్యాయ బృందం చర్యలు తీసుకుంది.

గత అక్టోబరులో గంజాయి మత్తులో ఒకే పాఠశాలకు చెందిన విద్యార్థులు గ్రూపులుగా విడిపోయి స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఒక విద్యార్థికి చేయి విరిగింది. ఈ వివాదం విద్యార్థుల తల్లిదండ్రుల రాజీతో పోలీసుల వరకు వెళ్లకుండా సద్దుమనిగింది. జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల తీరు ఆందోళన రేకెత్తిస్తుంది. పాఠశాలల సమయంలోనే బడి పిల్లలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఉపాధ్యాయులు కఠినచర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. తల్లిదండ్రుల అతి గారాబం కూడా విద్యార్థులను పెడదారి పట్టిస్తోంది. బడిలో, మిగతా సమయంలో పిల్లలు ఏం చేస్తున్నారో కొందరు తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదు. కనీసం వారి ప్రవర్తనపై దృష్టిపెట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం కూడా వారిని చెడు అలవాట్ల వైపు అడుగులు వేయిస్తోంది. పిల్లలు చేసే ఖర్చులపై, బడి విడిచిన తరువాత ఎప్పుడు ఇంటికి వస్తున్నారు, ఎక్కడ తిరుగుతున్నారనే విషయాలపై దృష్టి నిలపక విద్యార్థుల జీవితాలను ప్రమాదంలోకి నెట్టుతున్నారు.

**పోలీసులకు సమాచారం ఇవ్వాలి**

విద్యాసంస్థల పరిసరాల్లో మత్తుపదార్థాల అమ్మకాలు జరగడం లేదు. పలు పాఠశాలల్లో విద్యార్థులు సిగరేట్లు తాగుతున్నారనే సమాచారంతో విచారణ నిర్వహించాం. విద్యార్థులు దారి తప్పితే తల్లిదండ్రులు కానీ ఉపాధ్యాయులు కానీ పోలీసులకు సమాచారం ఇవ్వాలి. జి.కృష్ణ, ఏసీపీ, పెద్దపల్లి

**విద్యార్థులే లక్ష్యంగా మత్తుపదార్థాల అమ్మకాలు**

పాఠశాల విద్యార్థులే లక్ష్యంగా కొందరు మత్తు పదార్థాలను విక్రయిస్తున్నారు. పాఠశాలల సమీపంలోని కిరాణ దుకాణాల్లో చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో వాటిని అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక పాఠశాల సమీపంలో ఇలాంటి ప్యాకెట్లను విక్రయిస్తున్నట్లు సదరు పాఠశాల ఉపాధ్యాయులు గుర్తించి.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ సదరు అధికారులు కానీ పోలీసులు కానీ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. పైగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే అలాంటిదేమి లేదని చేతులు దులుపుకొంటున్నారు.

# తుది దశకు సేకరణ



జగిత్యాల : జిల్లాలో వానాకాలం ధాన్యం సేకరణ ముగింపు దశకు చేరింది. ఇప్పటికే చాలా కేంద్రాలను మూసివేయగా మరో 10-20 వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలుతో నాలుగైదు రోజుల్లో మిగిలిన అన్ని కేంద్రాల్లో సేకరణ ముగియనుంది. జిల్లాలో వరిసాగు, దిగుబడి అంచనా కన్నా చాలా తక్కువగా కేంద్రాలకు ధాన్యం రావటం ప్రైవేటు కొనుగోళ్లకు నిదర్శనంగా మారింది. ఎందుకంటే జిల్లాలో రికార్డుస్థాయిలో వానాకాలంలో 3.16 లక్షల ఎకరాల్లో వరిపంటను సాగుచేయగా ఇందులో 90 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో సన్నగింజ రకాలున్నాయి. సన్నరకాల్లో ఎకరాకు 16-26 క్వింటాళ్లు, దొడ్డురకాల్లో 18-28 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అన్ని రకాల్లోనూ సగటున 21 క్వింటాళ్ల కనీస దిగుబడిని లెక్కించినా 6.63 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి ఉంటుంది. ఈ మేరకు విత్తనోత్పత్తి, కుటుంబాల అవసరాల నిమిత్తం, మార్కెట్యార్డుల్లో విక్రయించింది పోనూ కనీసం 4-5 లక్షల మెట్రిక్ టన్నుల అంచనా కన్నా చాలా తక్కువకే సేకరణ పరిమితమైంది. ఈ సీజన్‌లో కల్లాలకు ధాన్యం ముందుగా వచ్చినా ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం సేకరణ ఆలస్యంగా మొదలుకావటం, మధ్యవర్తులు నేరుగా రైతులనుంచి పెద్దఎత్తున ధాన్యాన్ని కొనుగోలు చేయటంతో కేంద్రాలకు ధాన్యంరాక తగ్గింది. పలువురు మిల్లర్లు నేరుగా పచ్చిధాన్యాన్ని తీసుకొని డ్రయ్యర్లద్వారా ఆరబెట్టి తిరిగి ధాన్యాన్ని విక్రయించగా మరికొందరు పాత సీఎంఆర్ బకాయిల చెల్లింపు నిమిత్తం రైతుల నుంచి నేరుగా దొడ్డు ధాన్యాన్ని కొనుగోలు చేశారు. క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటనతో పెద్దఎత్తున సన్నధాన్యాన్ని రైతులు పండించిన అతితక్కువగానే ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోలు చేశారు. కేంద్రాల్లో కొర్రీలు, తొలిసారిగా సన్నాలు కొనటంతో సమస్యలు ఎదురవుతాయని, ఇతరత్రా కారణాలతో రైతులు పెద్దఎత్తున ప్రైవేటుగా లేదా మార్కెట్యార్డుల్లో సన్నాలను విక్రయించారు. ఏదేమైనా నిరుడు సన్నాలకు పలికిన ధరతో పోలిస్తే క్వింటాలుకు సరాసరిగా రూ.600 ధర తగ్గగా దొడ్డురకాలకు కూడా మద్దతు ధరకన్నా తక్కువగానే లభించినా రైతులు ప్రైవేటుబాటు పట్టడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. జిల్లా రైతులకు రూ.3.25 కోట్ల సన్నధాన్యం బోనస్ రాగా యాసంగిలోనూ సన్నగింజ రకాలను సాగుచేయాలని ప్రభుత్వం సూచిస్తుండగా కనీసం వచ్చే సీజన్లలోనైనా ప్రభుత్వం ద్వారా అధికంగా సన్నగింజ రకాలను కొనుగోలుచేసేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

జిల్లాలో సేకరణ కేంద్రాలు:430

కొనుగోలు చేసిన దొడ్డు ధాన్యం: 2.60 లక్షల మెట్రిక్ టన్నులు

కొనుగోలు చేసిన సన్న ధాన్యం: 6,500 మెట్రిక్ టన్నులు

కొన్న ధాన్యం విలువ: రూ.600 కోట్లు

రైతులకు చెల్లించింది: రూ.550 కోట్లు

# సత్వర సేవలకు సౌకర్యం




కోనరావుపేట: ఏళ్లుగా 108 అంబులెన్స్ లేక రోగులు, క్షతగాత్రులు ఇబ్బందులు పడేవారు. ఆపద సమయంలో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ విప్ చొరవతో రెండు మండలాలకు వాహనాలు మంజూరు కావడంతో గ్రామీణుల కష్టాలు తీరనున్నాయి. ప్రాణాపాయ స్థితిలో రోగులను సకాలంలో ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడింది.కోనరావుపేట, చందుర్తి మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 24 గంటలూ వైద్య సేవలు అందిస్తున్నారు. పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాలు సుమారు 30 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. కొన్ని అటవీ ప్రాంతాలకు దగ్గరలో ఉన్నాయి. రోగులకు వివిధ సేవలతోపాటు పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాల నిర్వహణకు అన్ని సౌకర్యాలు కల్పించారు. ప్రసవాల కోసం పీహెచ్‌సీల్లో ప్రత్యేక గది, వసతులు, పరికరాలు ఏర్పాటు చేశారు. కోనరావుపేట పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ గుర్తింపు కూడా వచ్చింది. ఇటీవల స్టాఫ్‌నర్సుల పోస్టులు భర్తీ చేశారు. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కొరత, వసతుల లేమి నెలకొనగా ఇటీవల ఒక్కొక్కటి పరిష్కారం అవుతున్నాయి. కోనరావుపేట పీహెచ్‌సీలో చాలా కాలంగా ఇద్దరు వైద్యులకు గాను ఒక్కరే ఉండగా నాలుగు రోజుల కిందట మరో వైద్యాధికారి బాధ్యతలు చేపట్టారు. చందుర్తిలోనూ సాధారణ కాన్పులు నిర్వహిస్తున్నారు. అత్యవసర సమయంలో రోగులను వైద్య సేవల కోసం తరలించేందుకు 108 వాహనాలు లేవు. దీంతో రోగులు ఇబ్బందులు పడేవారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు ఫోన్ చేస్తే వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల్లో ఎక్కడ ఖాళీగా ఉంటే అక్కడి నుంచి వచ్చేవి.

దీంతో 108 వాహనం వచ్చేసరికి గంట పట్టేది. క్షతగాత్రులు, గర్భిణులు నానా అవస్థలు పడేవారు. కొందరు ప్రైవేటు వాహనాల్లో వెళ్లేవారు. దీర్ఘకాలం తరవాత అంబులెన్సులు రావడంతో గ్రామీణుల కష్టాలు తీరనున్నాయి. **గ్రామీణులకు ఉపయోగం**పీహెచ్‌సీకి 108 అంబులెన్స్ అందజేయడంతో రోగులకు సౌకర్యంగా మారింది. ప్రాణాపాయ సమయంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించటానికి 108 వాహనం అందుబాటులో లేక గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. గతంలో నిజామాబాద్ ఎల్లమ్మ ఆలయం వద్ద ప్రధాన రోడ్డులో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు యువకులు గాయపడగా సకాలంలో 108 వాహనం రాక ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు.పాత్కాల రత్నం, కోనరావుపేట**ప్రభుత్వ విప్ చొరవతో...**వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 108 వాహనం మంజూరైంది. పీహెచ్‌సీలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే 108 వాహనం మంజూరు చేశారు. మరో వైద్యుడిని కూడా నియమించారు. ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలి.కోన వేణుమాధవ్, వైద్యాధికారి, కోనరావుపేట

# స్నేహమా... మైకమా!

హైదరాబాద్ : ఉప్పల్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి. చదువులో చురుగ్గా ఉండేవాడు. అకస్మాత్తుగా అతడి ప్రవర్తనలో మార్పు. కుటుంబసభ్యులతో పోట్లాడడం. తండ్రి జేబులో డబ్బులు కొట్టేయం చేసేవాడు. అనుమానం వచ్చి అతడి బ్యాగు పరిశీలిస్తే సిగరెట్లు కనిపించాయి. వాటిలో గంజాయి ఉంచి వాడుతున్నట్టు గుర్తించారు. మానసిక నిపుణుల కౌన్సెలింగ్‌లో అసలు విషయం వెల్లడించాడు. నగరంలో మాదకద్రవ్యాలు వినియోగిస్తూ, విక్రయిస్తూ పట్టుబడిన ప్రతి 100 మందిలో 90 మంది తాము మిత్రుల ద్వారానే అలవాటు పడినట్టు చెప్పినట్టు టీజీన్యాబ్ పరిశీలనలో గుర్తించారు.

**ఎందుకిలా మారుతున్నారంటే..** గంజాయి చాక్లెట్లు, బిస్కెట్లు విద్యార్థులకు విక్రయిస్తున్న పలు ముఠాలను పోలీసులు అరెస్ట్ చేశారు. రాజస్థాన్‌లో తయారయ్యే వీటిని నగరం, శివారు ప్రాంతాల్లోని 10 ప్రముఖ పాఠశాలల్లోని సుమారు 200 మంది విద్యార్థులు తీసుకుంటున్నట్టు నిర్ధారించారు. జూబ్లీహిల్స్‌కు చెందిన ఓ విద్యార్థిని 9వ తరగతిలోనే మత్తుమాత్రలకు దగ్గరైంది. బీటెక్ చేరేలోపు కొకైన్ తీసుకునేంతగా చేరిందని ఓ ఇన్‌స్పెక్టర్ వివరించారు. రోజుల తరబడి దగ్గుతో బాధపడుతున్న సమయంలో వైద్యపరీక్షల కోసం తల్లిదండ్రులు తీసుకొచ్చినపుడు వారికి గంజాయి అలవాటైనట్టు తెలుసుకుంటున్నారని జిస్టు వివరించారు.



**2 లక్షల మంది యాంటీ డ్రగ్ సోల్జర్స్..** నిత్యం రాష్ట్రంలో ఏదోమూలన గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటివి పట్టుబడుతున్నాయి. యువత జీవితాలను నాశనం చేస్తున్న వీటిని కట్టడి చేసేందుకు తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీజీన్యాబ్) దూకుడు పెంచింది. విద్యార్థి దశలోనే వీటికి చేరువవుతున్న వారిని పసిగట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల స్థాయిలో ప్రహరీ క్లబ్‌లు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేశారు. సుమారు 2 లక్షల మంది విద్యార్థులను యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా తయారు చేసేందుకు వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు టీజీన్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు.

**ఒత్తిడి లేని వాతావరణమే పరిష్కార మార్గం**

సందీప్‌శాండిల్య, డైరెక్టర్, టీజీన్యాబ్‌పిల్లల కదలికలను ఇంట్లో తల్లిదండ్రులు, గురువులు గమనిస్తుండాలి. మార్కులు, ర్యాంకులు సాధించాలంటూ వారిపై ఒత్తిడి తీసుకురావద్దు. మానసిక ఆందోళనకు గురైనపుడు బయటపడేందుకు ఇటువంటి మత్తుపదార్థాల వైపు మొగ్గుచూపుతారనేది గుర్తించాలి. యువతీ, యువకులు తాము డ్రగ్స్‌కు అలవాటు కావటం వల్ల కుటుంబం ఎంతటి మనోవేదనకు గురవుతుందనేది తెలుసుకోవాలి. ఒత్తిడి ఎదురైనపుడు ఇష్టమైన అభిరుచులతో బయటపడొచ్చు. మత్తుపదార్థాల కట్టడిలో ప్రతిపౌరుడు భాగం కావాలి. వివరాలను 1908, 87126 71111 నంబర్లకు సమాచారం అందించండి.ప్రవర్తనలో తేడా గుర్తిస్తే ఉపేక్షించొద్దు- డాక్టర్ రమేశ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ మానసిక వైద్యశాల

15-18 ఏళ్లుండే వారే ఎక్కువగా మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారు. చికిత్స కోసం ఇక్కడకు ప్రతి నెలా 10-15 మంది వస్తున్నారు. యుక్తవయసు పిల్లలు ఎక్కువగా మిత్రుల నుంచే వీటికి అలవాటవుతున్నారు. బిడ్డల ప్రవర్తన, మాటల్లో తేడా అనిపిస్తే తల్లిదండ్రులు వెంటనే స్పందించాలి. మానసిక నిపుణుల వద్దకు తీసుకెళ్లి దాన్నుంచి బయటపడేందుకు ప్రయత్నించాలి. ఇదంతా పిల్లలకు తెలియకుండా రహస్యంగా చేయవద్దు. సమస్యను వారితో పంచుకొని దాన్ని అధిగమించేందుకు చికిత్స అవసరమనే విషయం పంచుకోవాలి.

# కరుగుతున్న గుట్టలు.. కదలని అధికారులు

పరిగి : తాండూరు: తాండూరు నియోజకవర్గంలో గ్రామాలకు దూరంగా ఉంటున్న ప్రభుత్వ స్థలాల్లోని గుట్టలతో పాటు వ్యవసాయ పొలాల్లోని గుట్టలను అక్రమార్కులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. జిల్లాలో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అడిగేవారు లేరన్న ధీమాతో రాత్రింబవళ్లు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అటు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా ప్రకృతికి చేటు తెస్తున్నారు. ఈ నేపథ్యంలో 'పరిశీలనాత్మక' కథనం.

**జిల్లా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో..**

ప్రధానంగా జిల్లా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు ఇందుకు కేంద్రబిందువుగా మారాయి. తాండూరు, పెద్దేముల్, ధారూర్, మోమిన్‌పేట్, యాలాల్, కొడంగల్, నవాబుపేట, పరిగి, బంట్వారం, పూడూరు, కుల్కచర్ల తదితర మండలాల్లో అక్రమార్కులు యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. ట్రాక్టరు మట్టిని రూ.400 నుంచి రూ.600 వరకు, టిప్పరు అయితే రూ.2500 నుంచి రూ.3వేల వరకు విక్రయిస్తున్నారు.

**రావాల్సిన ఆదాయానికి రూ.కోట్లల్లో తూట్లు**

మట్టి తవ్వకాలు చేపట్టే వారు ఒక్కో క్యూబిక్ మీటరు నుంచి రూ.30 చొప్పున రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి చెల్లించాలనే నిబంధనలు ఉన్నాయి. ఒక్కో ట్రాక్టరు 2.85 క్యూబిక్ మీటర్లు, లారీ 8.55 క్యూబిక్ మీటర్ల చొప్పున మట్టిని తరలించే సామర్థ్యం ఉంటుంది. అయితే వందల ట్రాక్టర్లు, లారీల్లో అక్రమంగానే తరలిపోతోంది.

**నిబంధనల పాటింపు ఎక్కడ**

నిర్ణీత ప్రదేశాల్లో మట్టి తవ్వకాలు చేపట్టాలంటే మొదట గనుల శాఖకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలు సవ్యంగా ఉంటే అధికారులు ఎన్‌ఓసీ (నోఆబ్జక్షన్ సర్టిఫికెట్)ను సంబంధిత తహసీల్దారుకు పంపుతారు. అన్ని ప్రక్రియలు సజావుగా పూర్తయితేనే గనుల శాఖ మట్టి తవ్వకాలకు అనుమతిస్తుంది. అయితే అక్రమార్కులు ఇవేమీ పట్టించు కోవడం లేదు.

ట్రాక్టర్ మట్టికి రూ.400 రూ.600 వసూలు

టిప్పర్‌కు రూ.2,500 రూ.3,000 వసూలు

**వ్యక్తులు మరణించినా ఆగడంలేదు**

మున్సిపల్ పరిధిలో మట్టి తరలిస్తున్న టిప్పర్ల కింద పడి ముగ్గురు వ్యక్తులు మృతి చెందినా తవ్వకాలు ఆగడంలేదు. పెద్దనందిగామ వద్ద, చిట్లపల్లి గ్రామం వద్ద, జాతీయ రహదారిలో గతంలో కేవలం మట్టి తరలిస్తున్న టిప్పర్లు ఢీ కొని ఒకరు మృత్యువాత పడ్డారు. వారికి నామమాత్రంగా డబ్బులు అందించి చేతులు దులిపేసుకున్నారు.

**కఠిన చర్యలు తప్పవు** మట్టి తవ్వకాల విషయం మైనింగ్ శాఖ అధికారులు పరిశీలించాలి. కాని మా దృష్టికి వచ్చిన మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. తవ్వకాలకు అనుమతులు తప్పక తీసుకోవాలి.బి.విజయ్‌కుమార్, తహసీల్దార్, కొడంగల్.

## మత్తు.. యువత జోగుతూ..

హైదరాబాద్: మిత్రులతో కలసినా.. మానసిక ఒత్తిడిలో ఉన్నా.. చుక్కేస్తున్నారు.. కొన్నాళ్లకు అంతకుమించిన కిక్ కోసం మత్తుపదార్థాలు తీసుకుంటున్నారు. వీధి బాలలు వైట్నర్ దగ్గుమందు టే.. కాస్త వైద్య పరిజ్ఞానం ఉన్న యువకులు నిషేధిత దగ్గుమందు, నొప్పిమాత్రలు వేసుకుంటున్నారు. ఆసిఫ్‌నగర్ సమీపంలోని ఒక బస్తీలో 50కు పైగా కుటుంబాలు కర్ణాటక, రాజస్థాన్ నుంచి నిద్రమాత్రలు తీసుకొచ్చి రహస్యంగా విక్రయిస్తున్నారు.

**దొరికితేనే దొంగలు**

టీజీ న్యాబ్ సిబ్బంది ఈ ఏడాది అక్టోబరు వరకూ 6700 మత్తు మాత్రలు, 4500 నిషేధిత ఇంజెక్షన్లు, 100 దగ్గు సిరప్ సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత మందులను గుజరాత్, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల నుంచి వస్తున్నట్టు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.



కొరియర్, ప్రైవేటు వాహనాల్లో నిత్యావసర సరుకుల మాటున వీటిని నగరానికి తరలిస్తున్నారు.

**లాభాల కక్కుర్తితో..**

నగరంలో పలు మందులు దుకాణాలు కమీషన్ కక్కుర్తితో నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి. వైద్యుల సిఫార్సు లేకుండానే శస్త్రచికిత్స, తీవ్ర అనారోగ్య సమస్యలకు ఉపయోగించే ఇంజెక్షన్లు, నొప్పుల, నిద్ర మాత్రలను విక్రయిస్తున్నాయి. గతేడాది హెచ్‌న్యూ పోలీసుల తనిఖీలో సుమారు 10 మందుల దుకాణాలు ఇటువంటి నిషేధిత మాత్రలు విక్రయిస్తున్నట్టు గుర్తించాయి. బిహార్ కేంద్రంగా చిరువ్యాపారి రాజ్‌కుమార్‌గుప్త మత్తు ఇంజెక్షన్లకు ఉన్న డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు ఏకంగా యూనిట్ రూపొందించాడు. ఇ-కామర్స్ వెబ్‌సైట్ ద్వారా రూ.26 ధర పలికే ఇంజెక్షన్‌ను రూ.150 చొప్పున దేశవ్యాప్తంగా 88 లక్షల ఇంజెక్షన్లు విక్రయించాడు. బంజారాహిల్స్‌లోని ఒక ఆసుపత్రిలో పనిచేసే ఉద్యోగి నొప్పులకు ఉపయోగించే మాత్రలను బయటకు తీసుకొచ్చి యువతకు విక్రయిస్తున్నాడు.

## కళా విహీనంగా కూడళ్లు!

కరీంనగర్ : ఇందిరాగాంధీ, తెలంగాణ చౌక్ కూడలిని అన్ని హంగులతో తీర్చిదిద్ది గతేడాది జూన్ 25న అందుబాటులోకి తీసుకొచ్చారు. డిజిటల్ లైటింగ్‌తోపాటు నీళ్ల ఫౌంటెయిన్ ఆకర్షణీయంగా కనిపించాల్సి ఉండగా ప్రస్తుతం అంధవికారంగా తయారైంది. నాలుగేళ్ల కిందట బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన జంక్షన్‌లో లైటింగ్, వాటర్ ఫౌంటెయిన్ పని చేయడం లేదు. చౌరస్తా మధ్యలో ఉన్న హైమాస్ట్ లైట్లు కూడా పది రోజులుగా వెలగడంలేదు. వాహనాలు తగలడంతో ఒక వైపు కూలినా మరమ్మతులు చేయడంలేదు.

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కరీంనగర్ నగర పరిధిలో కూడళ్లను అభివృద్ధి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే వారికి, నగరవాసులకు రాత్రిపూట ఆహ్లాదకరంగా, అందంగా ఉండేలా ప్రధాన కూడళ్లను తీర్చిదిద్దారు. దీనికోసం స్మార్ట్‌సిటీలో రూ.4.50 కోట్లు వెచ్చించారు. తీగల వంతెన సదాశివపల్లి వైపు, రామగుండం బైపాసు రోడ్డు మధ్యలో, మారుతీనగర్ చౌరస్తా, ఇందిరాచౌక్, నాకాచౌరస్తా, పాత ఎంప్లాయిమెంట్ కూడలి, ఆచార్య జయశంకర్, పొట్టి శ్రీములు విగ్రహం కూడలి ఉండగా, నాలుగేళ్ల కిందట కమాన్ చౌరస్తా, బస్టాండ్ ఇన్ గేట్ శ్రీపాద జంక్షన్, ఆర్అండ్‌బీ, అంబేద్కర్ విగ్రహం, మంచిర్యాల చౌరస్తాలలో అన్ని హంగులు కల్పించారు. ప్రధానంగా లైటింగ్‌తోపాటు అన్ని చోట్ల వాటర్ ఫౌంటెయిన్ ఏర్పాటు చేశారు.

**నిర్లక్ష్యంగా వదిలేశారు**

నగరంలోని ప్రధాన కూడళ్లను ఆకర్షించేలా ఒక్కో కూడలికి రూ.20 లక్షల నుంచి రూ.1.30 కోట్ల వరకు ఖర్చు చేశారు. లైటింగ్, ఫౌంటెయిన్, మొక్కల నిర్వహణ, మరమ్మతులు వంటివి ఎప్పటికప్పుడు



తనిఖీలు చేస్తూ మరమ్మతులు చేయాల్సి ఉండగా పట్టించుకునే వారే కరవయ్యారు. కొన్ని చోట్ల వాహనాలు తగిలి కొంతమేర ఊడిపోయాయి. ఇంజినీరింగ్ అధికారులు సైతం ఆ కూడళ్లు నగరంలో లేనట్లుగానే అంటి ముట్టనట్లుగా ఉంటున్నారు.

**దృష్టి సారించని ఉన్నతాధికారులు..**

కూడళ్లను సుందరీకరించి అప్పగించిన కూడళ్లను.. వాటి నిర్వహణ గడువు ముగిసే వరకు సంబంధిత గుత్తేదారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. స్మార్ట్‌సిటీలో భాగంగా గతేడాది జూన్‌లో వీటిని ప్రారంభించారు. వీటికి కనీసం రెండేళ్లు నిర్వహణను చూడాల్సి ఉండగా స్మార్ట్‌సిటీ ఏజెన్సీ నిర్వాహకులు కూడా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి కూడళ్ల నిర్వహణ, మరమ్మతులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

**చర్యలకు ఆదేశించాం–** వై.సునీల్‌రావు, మేయర్, కరీంనగర్

కూడళ్ల నిర్వహణను రెండేళ్లపాటు గుత్తేదారు చేపట్టాలి. యథావిధిగా పని చేసేలా అధికారులు పర్యవేక్షణ చేయాల్సిందే. పనులు చేయకపోతే బిల్లులో రికవరీ చేయించాలి. నిర్లక్ష్యం వహిస్తున్న ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించాం.

## సరైన ప్రణాళికే.. ప్రగతికి వేదిక



పరిగి: దినదినాభివృద్ధి చెందుతున్న పరిగి పురపాలక సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగానే గత ప్రభుత్వం పంచాయతీ హోదా నుంచి మున్సిపల్ హోదాకు మార్చింది. వీటికి ప్రత్యేక నిధులను సమకూరుస్తోంది. అయితే గతంలో సరైన ప్రణాళిక లేని కారణంగా అభివృద్ధి అనుకున్న విధంగా సాగలేదు. తాజాగా ప్రభుత్వం వివిధ రకాల మౌలిక సదుపాయాలను సమకూర్చి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలకు ఉపక్రమించింది. మెరుగైన వసతుల ద్వారా అదనపు ఆదాయ వనరులను సమకూర్చేలా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రణాళికను సిద్ధం చేశారు. ఇందులో భాగంగానే ఇటీవల పరిగి మున్సిపాలిటీకి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద రూ.25కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులను ఒక పద్ధతి ప్రకారం అభివృద్ధి పనులకు వెచ్చించాల్సిన అవసరాన్ని పేర్కొంటూ కథనం.

**భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని..**

గతంలో వివిధ పథకాల కింద లక్షలాది రూపాయలతో చేపట్టిన పనులు దెబ్బతిన్నాయి. ప్రణాళిక లేకుండా రోడ్డు పనులు పూర్తిచేశారు. వాటి కిందఉన్న మంచినీటి పైపులైన్ల లీకేజీలతో రోడ్లు దెబ్బతిన్నాయి. మరో చోట మీటర్ల కొద్దీ ఉన్న పైప్‌లైన్లను వదిలిపెట్టి కొత్త పనులు చేపట్టాల్సి వచ్చింది. ఇప్పుడు అలా జరగకుండా భవిష్యత్తు అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది.

నీటి ఎద్దడి శాశ్వత పరిష్కారంలో భాగంగా అమృత్ -2 పథకం కింద రూ.14.5కోట్లు వెచ్చిస్తుండగా టీయూఎఫ్ఐడీసీ కింద ప్రధానంగా అంతర్గత రహదారులను సీసీతో మెరుగు పరచాలి. మురుగు కాల్వలను నిర్మించి పారిశుధ్య వ్యవస్థను తీర్చిదిద్దాల్సి ఉంది. అనేక కొత్త కాలనీలలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించాల్సి ఉంది.

కొత్తగా చేపట్టే పనులివే..

మున్సిపల్ ఆఫీస్ నుంచి మల్కాపూర్ రోడ్డులో 800 మీటర్ల దూరం ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మురుగు కాల్వల నిర్మాణం.

మల్లెమోనిగూడ రోడ్డు మరమ్మతు పనులు.

ఎర్రగడ్డపల్లి తారు రోడ్డు అభివృద్ధి.

కూడళ్ల సుందరీకరణ ద్వారాల ఏర్పాటు.

మున్సిపాలిటీకి రూ.5కోట్లతో పక్కా భవనం ఏర్పాటు.

## రిజర్వాయర్లకు రక్షణేదీ?

హైదరాబాద్: లక్షలాది మంది ప్రజల ఆరోగ్యంతో ప్రతిపాదనలకే సీసీ కెమెరాలు, ప్రత్యేక నిఘాడిపడి ఉన్న కీలక అంశంపై జలమండలి ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. జలమండలి రిజర్వాయర్ల వద్ద అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోవడంతోపాటు కనీస భద్రతా చర్యలను విస్మరిస్తోంది. సుమారు 400కు పైగా సర్వీసు రిజర్వాయర్లుండగా వీటిలో కీలకమైనవి 225. రెండున్నర ఏళ్ల క్రితం ముషీరాబాద్ ప్రాంతంలో రిసాల్‌గడ్డ వాటర్ ట్యాంక్‌లో కుళ్లిపోయిన మృతదేహం బయటపడింది. అప్పటికే ఆ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా కాగా లక్షలమంది ఆ నీటినే తాగారు.

**అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..**

జలమండలి రిజర్వాయర్ ప్రదేశం నిషేధిత ప్రాంతమైనా ఎవరైనా



వెళ్లి రావడానికి ఎలాంటి అభ్యంతరాలుండవు. కనీసం అడిగేవారు కూడా ఉండరు. కీలకమైన ప్రదేశాల్లో, విశాలంగా చెట్లతో ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలు సాధారణంగా మారాయి. భారీ రిజర్వాయర్‌లపైకి మెట్ల సాయంతో చేరుకున్నా పట్టించుకునే వారు ఉండరు. ఎవరుపడితే వారు సెల్ఫీలు తీసుకునేందుకు పైకి ఎక్కుతున్నారు. ఆకతాయిలకు ఆటవిడుపు కేంద్రాలుగా పలు రిజర్వాయర్ పరిసరాలు మారాయి.

**నియంత్రించలేమంటున్న జలమండలి సిబ్బంది**

వాటర్ ట్యాంకర్లకు నీటిని నింపడం, నీటి సరఫరా వంటి అంశాల్లో తలమునకలై ఉండే తాము ఎవరొస్తున్నారని గుర్తించడం, నియంత్రించడం సాధ్యం కాదని పేర్కొంటున్నారు. ప్రత్యేకంగా సెక్యూరిటీని నియమించాలని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా ప్రయోజనం ఉండటం లేదని రిజర్వాయర్ వద్ద విధులు నిర్వహిస్తున్న సీనియర్ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు.

## వరద నిలుపు.. పొలం తడుపు



తాండూరు: జిల్లాలో కాగ్నా, కాకర వేణి నదులపై 5 ఆనకట్టల నిర్మాణ పనులు రెండు నెలల్లో ప్రారంభం కాబోతున్నాయి. ఇప్పటికే రెండు చోట్ల గడచిన వేసవిలో పనులకు శ్రీకారం చుట్టగా భారీ వర్షాల నేపథ్యంలో ఆగిపోయాయి. ప్రస్తుతం నదుల్లో ప్రవాహం తగ్గడంతో నిర్మాణాలకు అనుకూల వాతావరణం ఏర్పడింది. ఐదు చోట్ల ఆనకట్టలు పూర్తయితే బహుళ ప్రయోజనాలు ఒనగూరనున్నాయి. ఈ నేపథ్యంలో కథనం.

2022-23 ఆర్థిక సంవత్సరంలో నిధుల మంజూరు: గత ప్రభుత్వం 2022-23లోనే రెండు నదులపై ఆనకట్టల నిర్మాణానికి రూ.43 కోట్ల నిధులు మంజూరు చేసింది. అంతకు ముందే నదులకు అడ్డంగా ఆనకట్టల నిర్మాణం ఎక్కడెక్కడ చేపట్టాలనే విషయంలో భూగర్భ వనరులు, నీటి పారుదల శాఖ ఇంజినీర్లు సర్వే చేశారు. ఆమేరకు ఆనకట్టల నిర్మాణం చేపడితే నీరు ఎంత పొడవున నిలుస్తుంది. పరివాహక బోర్లలో జల మట్టం పెరిగితే ఎన్ని ఎకరాల ఆయకట్టు అదనంగా అందుబాటులోకి వస్తుందనే వివరాలను నివేదికలో పొందు పరిచి ప్రభుత్వానికి పంపించారు. ఒక్కో ఆనకట్ట నిర్మాణానికి ఎన్ని నిధులు వ్యయమౌతాయనే విషయంలో నీటి పారుదల శాఖ అంచనాలను రూపొందించింది. ఆమేరకు నిధులు మంజూరయ్యాయి. వెంటనే టెండర్లు కూడా పూర్తయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఏడాది వేసవిలో మొత్తం ఐదు ఆనకట్టలకు గాను రెండు చోట్ల పనులు ప్రారంభించింది. జులై నుంచి భారీ వర్షాలు కురిశాయి. నదులు ఉధృతంగా ప్రవహించడంతో పనులు ఆగిపోయాయి. తాజాగా నదుల్లో వరద అంతగా లేనందున పనులు చేపట్టేందుకు ప్రతికూలత పెద్దగా ఉండదని అధికారులు చెబుతున్నారు.

**ఆనకట్టలు నిర్మించే గ్రామాలు**

పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లి

తాండూరు మండలం చంద్రవంచ, ఖాంజాపూరు

యాలాల మండలం: దేవనూరు, బెన్నూరు (గడచిన వేసవిలో నిర్మాణాలు ప్రారంభమయ్యాయి).

చేకూరే బహుళ ప్రయోజనాలు

ఒక్కో ఆనకట్ట వద్ద ఆరు అడుగుల ఎత్తుతో కిలోమీటరు పొడవునా వరద నిలుస్తుంది. పరివాహక వ్యవసాయ బోర్లు, తాగు నీటి వనరుల్లో 10నుంచి 20 అడుగుల ఎత్తుకు నీటి మట్టం పెరుగుంది.

ప్రతి ఆనకట్ట పరిధిలో 300 ఎకరాల చొప్పున ఆయకట్టు అందుబాటులోకి వస్తుంది. మత్స్య కారులు చేపలు పెంచి ఏడాది పొడవునా ఉపాధి పొందుతారు వన్య ప్రాణులు, పక్షులకు తాగు నీటికి ఎద్దడి ఉండదు. వేసవి చివరి నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యం

ఈ ఏడాది వేసవి చివరి వరకు ఆనకట్టలను పూర్తి చేయాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నాం. అనుకున్నట్లు నిర్మాణాలు పూర్తయితే వచ్చే వర్షాకాలంలోనే ఆనకట్టలు నీటితో నిండుతాయి. ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయి. కాగ్నా, కాకర వేణి నదుల నుంచి వృథాగా పోయే వరదకు అడ్డుకట్ట పడుతుంది. - సుందర్, ఈఈ, జిల్లా నీటి పారుదల శాఖ.

## విద్యార్థులకు ఆర్థిక ఉపశమనం



వికారాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల్లోని విద్యార్థుల డైట్ ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలను పెంచటంతో జిల్లాలోని సుమారుగా 20,000 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటి వరకు అతి తక్కువగా డైట్ ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించటంతో వీటితోనే నెట్టుకు రావాల్సి వచ్చింది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి రెండు, మూడు సంవత్సరాల కోసారి డైట్ ఛార్జీలు పెంచాల్సింది పోయి ఏళ్ల తరబడి పెంచక పోవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. తాజా పెంపుతో విద్యార్థులకు కొంతమేరకైనా నాణ్యమైన భోజనాన్ని పెట్టడానికి అవకాశం ఉందని పలువురు అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అందిస్తున్న కథనం..

**2017 తరువాత మళ్లీ ఇప్పుడే..**

డైట్ ఛార్జీలు గత 2017లో పెంచారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పెంచకపోవటంతో విద్యార్థి సంఘాలు తరచుగా ఆందోళనలు జరిపారు. ఇక విద్యార్థినులకు చెల్లించాల్సిన కాస్మొటిక్ ఛార్జీలు 2008 తరవాత పెంచలేదు. 16 సంవత్సరాల క్రితం పెంచిన ఛార్జీలే నేటికీ చెల్లిస్తున్నారు. వీటిని కూడా సక్రమంగా విడుదల చేయకపోవటంతో విద్యార్థినులు ఇబ్బందులకు లోనయ్యారు. డైట్ ఛార్జీలు 3నుంచి 7వ తరగతి విద్యార్థులకు రూ.950 నుంచి రూ.1330లకు, 8వ తరగతి నుంచి 10 విద్యార్థులకు రూ.1100 నుంచి రూ.1540కు ఇంటర్ నుంచి పీజీ వరకు విద్యార్థులకు రూ.1500 నుంచి రూ.2100కు పెంచారు.

**బీసీ విద్యార్థులకు పాకెట్ మనీకి డిమాండ్**

ఇంటర్ ఆపైన చదివే బీసీ విద్యార్థులకు పాకెట్ మనీ కింద నెలకు రూ.500 చెల్లించాలని ఎప్పటి నుంచో విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. దీన్ని కొన్నేళ్లుగా ఎస్సీ ఇంటర్ విద్యార్థులకు చెల్లిస్తున్నారు. తమకివ్వక పోవడం శోచనీయమని బీసీ విద్యార్థులు అంటున్నారు.

**ఈనెల నుంచే అమలు**

పెంచిన డైట్, కాస్మొటిక్ ఛార్జీలు ఈనెల నుంచి అమలులోకి వస్తాయి. ఛార్జీలు పెంచటం వల్ల విద్యార్థులకు మంచి ప్రయోజనం కలుగుతుంది. - ఉపేందర్, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి.

## స్థానిక సమరానికి సామగ్రి సిద్ధం

పెద్దపల్లి : స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. తుది ఓటరు జాబితా సిద్ధం చేసిన అధికారులు మిగిలిన పనుల్లో వేగం పెంచారు. జిల్లాల వారీగా బ్యాలెట్ డబ్బాలకు మరమ్మతు పనులు చేపట్టారు. ఎన్నికలకు అవసరమైన సామగ్రి జిల్లాలకు చేరుతోంది. షెడ్యూలు ఎప్పుడు విడుదలైనా ఎన్నికల నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఇప్పటికే జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఎన్నికల సిబ్బంది శిక్షణకు సంబంధించిన మాడ్యూల్స్, ప్రిసైడింగ్, రిటర్నింగ్ అధికారుల కరదీపికలు జిల్లాలకు చేరాయి. సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికల సామగ్రి విడతల వారీగా వస్తోంది.

**పోలింగ్ కేంద్రాల పరిశీలన**

ఉమ్మడి జిల్లాలో పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలించారు. తాగునీరు, ప్రహరీ, విద్యుత్తు సరఫరా, ఫ్యాన్లు, ర్యాంపులు తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయా? ఏమైనా సమస్యలున్నాయా? అనే కోణంలో మండల స్థాయిలో అధికారులు పరిశీలించారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా ఎక్కడైనా అదనంగా పోలింగ్ కేంద్రాలు అవసరమా? అనే విషయమై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. కుల గణనకు సంబంధించి ఇంటింటి కుటుంబ సర్వేకు దాదాపు రెండు నెలల సమయం పట్టనుండగా ఈలోపు ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే కొంతవరకు ఇబ్బందికరంగా ఉండనుంది. కుల గణన పూర్తయిన వెంటనే రిజర్వేషన్లపై స్పష్టత రానుంది. మొత్తంగా 2025లోనే ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి.

**నిఘా నీడలో..**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,210 పంచాయతీల పరిధిలో 11,132 వార్డులున్నాయి. 58 జడ్పీటీసీ, 653 ఎంపీటీసీ స్థానాలున్నాయి. కొద్ది రోజులుగా ఎన్నికలకు అవసరమైన సామగ్రి జిల్లాలకు చేరుతోంది. వీటిని స్థానిక గోదాముల్లో భద్రపరుస్తున్నారు. ఇతరులు ఎవరూ వాటి లోపలికి వెళ్లకుండా సీసీ కెమెరాల పర్యవేక్షణ కొనసాగుతోంది. ఒక్కో వార్డుకు ఒక బ్యాలెట్ పెట్టె వినియోగించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు విడతల వారీగా నిర్వహించనుండటంతో ఒక చోట వినియోగించిన బ్యాలెట్ పెట్టెలను మరో చోట వాడుకునే వీలుంటుంది.

## ధాన్యం తడిసి.. మొలకెత్తుతోంది..!

కామారెడ్డి : ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి 20 రోజులు దాటుతున్నా.. ఇంకా కాంటా వేయలేదు. వర్షాలు కర్షకులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో రైతులు ధాన్యాన్ని రక్షించుకోవడానికి నానాపాట్లు పడుతున్నారు. కొందరు రైతులు నేరుగా రైస్‌మిల్లర్లకు క్వింటాలుకు రూ.1900 చొప్పున విక్రయించుకుంటున్నారు.

**రైతులకు నష్టం..**

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువస్తున్న రైతులకు సంచుల అద్దె భారం పెరిగిపోతోంది. సమయానికి టార్పాలిన్ కవర్లను సరఫరా చేయకపోవడంతో చాలా మంది రైతులు ఆయా గ్రామాల్లో ధాన్యం రక్షణకు సంచులను అద్దెకు తీసుకుంటున్నారు. ఒక్కో రైతు 5-10 సంచులు అద్దెకు తీసుకోవడంతో నిత్యం రూ.150 వరకు అద్దె భరిస్తున్నారు. ధాన్యాన్ని నిత్యం కుప్ప చేయడం, ఉదయం మళ్లీ కూలీల సహాయంతో ఆరబెట్టడానికి ప్రతీ రోజు రూ.500 వరకు ఖర్చులు భరిస్తున్నామని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఒక్కొక్కరు చొప్పున 24 గంటల పాటు ధాన్యం కుప్పలకు కాపలాగా ఉంటున్నామని పేర్కొంటున్నారు. ధాన్యం త్వరగా కాంటా చేయిస్తే యాసంగి పంటల సాగుపై దృష్టి పెట్టేవారమని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం కాలయాపన చేస్తే రైతులపై భారం మరింత పడే అవకాశం ఉంది. ఈ విషయమై పౌరసరఫరాలశాఖ డీఎం రాజేందర్‌ను న్యూస్‌టుడే వివరణ కోరగా నుంచి కొనుగోళ్లు వేగవంతం చేస్తామన్నారు.

‘చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు భాస్కర్. కామారెడ్డి మండలం పాత రాజంపేట నివాసి. కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని 12 రోజుల క్రితం తీసుకువచ్చాడు. ధాన్యం ఆరబెట్టుకోవడానికి, కుప్పగా పోసిన తర్వాత రాత్రిపూట రక్షణ కోసం సంచులను(టార్పాలిన్లకు బదులుగా) అద్దెకు తీసుకువచ్చాడు. ఒక్కో సంచికి నిత్యం రూ.20 చొప్పున 8 సంచులు తెచ్చుకున్నాడు. నిత్యం రూ.160 చెల్లిస్తున్నాడు. ఇప్పటి వరకు రూ.1920 కేవలం సంచులకు అద్దె చెల్లించాడు. కానీ కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు ధాన్యం కాంటానే ప్రారంభించలేదు’



# లోకేశ్ కృషి వల్లే విశాఖలో గూగుల్ ఏర్పాటుకు ఎంవోయూ: సీఎం చంద్రబాబు

అమరావతి: ప్రతి సంక్షోభంలో అవకాశాలు ఉంటాయని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడారు. సంక్షోభంలో అవకాశాలు సృష్టించుకోవడమే నాయకత్వమన్నారు. ప్రజా చైతన్యమే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష అని చెప్పారు. "ప్రభుత్వ విధానాల చర్చకు కలెక్టర్ల సదస్సు ఉపయోగపడుతుంది. ప్రయత్నాలు చేసిన వెంటనే ఫలితాలు రావు. నిరంతరం ప్రయత్నిస్తుంటేనే రిజల్ట్ వస్తాయి. విశాఖలో గూగుల్ కంపెనీ ఏర్పాటుకు ఎంవోయూ కుదిరింది. మంత్రి లోకేశ్ కృషి వల్లే ఇది సాధ్యమైంది. గూగుల్‌తో ఎంవోయూ వల్ల విశాఖలో అధిక అభివృద్ధి జరుగుతుంది. హార్డ్ వర్క్ ముఖ్యం కాదు.. స్మార్ట్ వర్క్ కావాలి. గతంలో కేంద్ర ప్రభుత్వ నిధులనూ దారి మళ్లించారు. నూతనంగా 20 విధానాలు తీసుకొచ్చాం. 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తున్నాం. అమరావతి కోసం ఇప్పటికే రూ.31 వేల కోట్లు సేకరించాం. 2027 లోపు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని నిర్ణయించాం. మూడు నెలలకు కలిపి ఒకేసారి పింఛన్ ఇచ్చేలా విధానం తెచ్చాం. దేశంలో ఎక్కువ పింఛన్ ఇచ్చే రాష్ట్రం ఏపీనే. ఇతర రాష్ట్రాల్లో మనం ఇస్తున్న పింఛన్‌లో సగం కూడా ఇవ్వడంలేదు. దీపం-2 కింద ఇప్పటికే 40 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చాం. వచ్చే ఏడాది స్కూళ్ల ప్రారంభం నాటికి టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం. 60 శాతానికి పైగా భూసమస్యల ఫిర్యాదులు వస్తున్నాయి. రెవెన్యూ సదస్సులను నామమాత్రంగా నిర్వహిస్తే కుదరదు. 90 శాతం సమస్యలు ఐదారు శాఖల్లోనే ఉన్నాయి. సంక్రాంతి నాటికి ఆర్అండ్‌బీ రోడ్లపై గుంతలు ఉండకూడదు. వచ్చే 20 ఏళ్లలో 15 శాతం వృద్ధి రావాలి" అని చంద్రబాబు తెలిపారు.

**రాళ్లు, రప్పల మధ్య నగరాన్ని చూడగలిగిన దార్శనికుడు చంద్రబాబు: పవన్..** రాళ్లు, రప్పల మధ్య నగరాన్ని చూడగలిగిన దార్శనికుడు సీఎం చంద్రబాబు అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్రజలు తమను విశ్వసించి భారీ విజయం కట్టబెట్టారని చెప్పారు. ప్రజలు తమ నుంచి చాలా ఆశిస్తున్నారని పేర్కొన్నారు. "ప్రజలకు ఉపయోగపడే పాలసీలు మేం చేయగలం. విధానాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులదే. గత ప్రభుత్వం అధికారులను చాలా ఇబ్బంది పెట్టింది. రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల అప్పు ఉంది. జీతాలు ఇవ్వలేని స్థాయికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారింది. అభివృద్ధికి అధికారుల సహకారం కావాలి. కాకినాడలో 3 చెక్‌పోస్టులు ఉన్నా స్మగ్లింగ్ జరుగుతోంది. ఐఏఎస్, ఐపీఎస్‌లు వ్యవస్థను బలోపేతం చేయాలి." అని పవన్ కల్యాణ్ చెప్పారు.

# కూటమి ప్రభుత్వం ఆరు నెలల విజయాలపై కరపత్రం విడుదల



అమరావతి, డిసెంబర్ 11: ఏపీ ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించి కూటమి ప్రభుత్వం విజయం సాధించి అధికారాన్ని చేతబట్టింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏపీ అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూసుకెళ్తున్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నారు. పెన్షన్ల పెంపు, దీపం పథకాన్ని ఇప్పటికే అమలు అయ్యాయి. అలాగే మరిన్ని పథకాలను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వ సన్నాహాలు చేస్తోంది. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలను పూర్తి అయ్యింది. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఆరు నెలల విజయాలను టీడీపీ నేతలు మీడియాకు వివరించారు. ఆరు నెలల కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన టాప్ 20 కార్యక్రమాల వివరాల కరపత్రికను బుధవారం టీడీపీ నేతలు విడుదల చేశారు. ఈ సందర్భంగా తొండపూజ దశరథ జనార్ధన్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ ఏర్పాటు అయ్యి ఆరు నెలలు పూర్తయిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు వైసీపీ పాలనలో స్వేచ్ఛ స్వతంత్రాలను పోగొట్టుకున్నారని.. గడిచిన ఐదేళ్లలో ప్రజల ఆస్తులకు మానప్రాణాలకు కూడా భద్రత లేదన్నారు. ప్రజల ఆస్తులను బహిరంగంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన ఆరు నెలల నుంచి ప్రజలు స్వేచ్ఛ స్వతంత్రాలను అనుభవిస్తున్నారని తెలిపారు. గడిచిన ఆరు నెలల్లో ప్రజలు తమ సమస్యలను ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వానికి చెప్పుకుంటున్నారన్నారు. రాబోయే ఐదేళ్లలో 1,60,000 కోట్ల రూపాయలు పెన్షన్ల రూపంలో ఇవ్వబోతున్నామని వెల్లడించారు. సంక్షేమ విషయంలో వైసీపీ ప్రభుత్వానికి టీడీపీకి నక్కకి నాగలోకానికి ఉన్నంత తేడా ఉందంటూ వ్యాఖ్యలు చేశారు.

**అబద్ధాలు.. జగన్ కవల పిల్లలు: వర్ల...** ఆరు నెలల కాలంలో టీడీపీ టాప్ 20 కార్యక్రమాలను వివరించిన ఆ పార్టీ నేత వర్ల రామయ్య వివరించారు. ఆరు నెలల్లో జరిగిన కూటమి పరిపాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ఏనాడు కేంద్రం దృష్టికి తీసుకురాలేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా ఎక్కడా సంక్షేమానికి ఇబ్బంది కలగకుండా చూస్తున్నామని తెలిపారు.

అబద్ధాలు.. జగన్మోహన్ రెడ్డి ఇద్దరూ కవల పిల్లలాంటివారని విమర్శించారు. అన్ని వర్గాల ఆకాంక్షలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని వర్ల రామయ్య పేర్కొన్నారు.

**జగన్‌కు మాల్యాద్రి సవాల్..** హామీల అమలులో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని జగన్ అబద్ధాలు చెప్తున్నారని టీడీపీ నేత మాల్యాద్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి ఆరు నెలల కాలంలో టీడీపీ.. వైసీపీ ప్రభుత్వాల మధ్య జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. తన కుంభకోణాల నుంచి దృష్టి మళ్లించడానికి కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. జగన్ నోరు తెరిస్తే అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. ప్రజల మధ్య కుల మత ప్రాంతీయ చిచ్చులు పెట్టి తన దోపిడీ నుంచి జగన్ దృష్టి మళ్లిస్తున్నారని విమర్శించారు. ఇటువంటి వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కులతత్వాన్ని రెచ్చగొట్టే విధంగా జగన్ చూస్తున్నారని మాల్యాద్రి వ్యాఖ్యలు చేశారు.



## మాజీ మంత్రి పేర్ని నాని సతీమణిపై కేసు

మచిలీపట్నం: వైకాపా నేత, మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి జయసుధపై కేసు నమోదైంది. రేషన్ బియ్యం అక్రమాలపై పౌరసరఫరాల శాఖ అధికారి కోటిరెడ్డి ఫిర్యాదు మేరకు మచిలీపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. వైకాపా హయాంలో జయసుధ పేరిట గిడ్డంగిని పేర్ని నాని నిర్మించారు. దాన్ని పౌరసరఫరాల శాఖకు అద్దెకు ఇచ్చారు. ఇటీవల ఆ గిడ్డంగిని అధికారులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో బియ్యం నిల్వల్లో వ్యత్యాసాన్ని గుర్తించారు. 185 టన్నుల పీడీఎఫ్ బియ్యం మాయమైనట్లు తేల్చారు. వేబ్రిడ్జి సరిగా పనిచేయడం లేదంటూ తప్పించుకునేందుకు పేర్ని నాని యత్నించారు. ఈ క్రమంలో అధికారి కోటిరెడ్డి ఫిర్యాదు మేరకు పేర్ని నాని సతీమణిపై కేసు నమోదైంది.

## అదానీతో విద్యుత్ ఒప్పందాలపై పిల్.. ఏపీ హైకోర్టులో విచారణ



అమరావతి: అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలకు సంబంధించి దాఖలైన పిల్‌పై ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం సంక్రాంతి సెలవుల తర్వాతకు వాయిదా వేసింది. విద్యుత్ ఒప్పందం వల్ల రాష్ట్ర ఆదాయానికి నష్టమని పిటిషనర్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు.

అదానీ, సెకీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలపై విచారణ చేయాలని గతంలో పిల్ దాఖలైంది. దీన్ని మంత్రి పయ్యావుల కేశవ్, సీపీఐ నేత రామకృష్ణ దాఖలు చేశారు.

**వైకాపా నేత గౌతమ్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత**: వైకాపా నేత గౌతమ్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఉమామహేశ్వర శాస్త్రిపై హత్యాయత్నం కేసులో ఆయన నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో ఆయన ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేయగా.. ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది.

## భోగాపురం విమానాశ్రయం 2026 జూన్ కల్లా సిద్ధం: కేంద్రమంత్రి రామ్మోహన్



హైదరాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టు వెనుక ఏపీ సీఎం చంద్రబాబు కృషి ఉందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. అప్పట్లో 5 వేల ఎకరాల భూసేకరణ అంటే సామాన్యమైన విషయం కాదని చెప్పారు. శంషాబాద్ నోవాటెల్‌లో ఎయిర్‌పోర్ట్ ప్రిడిక్టివ్ ఆపరేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుల కాన్సెప్ట్ వెనక చంద్రబాబు ఉన్నారన్నారు. దేశంలో ఐటీ విప్లవం వెనక ఆయన కృషి ఉందని చెప్పారు. ఇప్పటికీ దేశాభివృద్ధికి ఐటీ చోదకశక్తి అని చంద్రబాబు నమ్ముతారని వ్యాఖ్యానించారు. విమానాశ్రయాల నిర్వహణలో అత్యున్నత సాంకేతికతను వాడుతున్నట్లు వివరించారు. సరికొత్త సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. "దేశంలోని 24 విమానాశ్రయాల్లో డిజియాత్ర టెక్నాలజీ వాడుతున్నాం. డేటా అనలటిక్స్ వాడి సేవలు మరింత మెరుగ్గా అందిస్తాం. విమానాశ్రయం అంటే కేవలం రవాణా సౌకర్యం కాదు. అది ఉపాధి మార్గం.. సాంస్కృతిక కేంద్రం కూడా. నరేంద్ర మోదీ నాయకత్వంలో విమానయాన మంత్రిత్వ శాఖ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచం అంతా భారతదేశం వెట్కపు చూస్తోంది. వరంగల్, భోగాపురం ఎయిర్‌పోర్టులను పూర్తి చేయాల్సి ఉంది. భోగాపురం విమానాశ్రయం 2026 జూన్ కల్లా పూర్తవుతుంది. మరో ఐదేళ్లలో 50 విమానాశ్రయాలు పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎయిర్ పోర్ట్ ప్రిడిక్టివ్ ఆపరేషన్ సెంటర్ ప్రారంభించడం ఒక మైలు రాయి" అని రామ్మోహన్ నాయుడు అన్నారు.




తైవాన్ ద్వీపం చుట్టుపక్కల సముద్ర జలాల్లో చైనా దూకుడు పెరిగింది. మూడు దశాబ్దాల్లో ఎన్నడూ లేని స్థాయిలో డ్రాగన్ తన బలగాలను తైవాన్ చుట్టుపక్కల మోహరించింది. దీంతో తైవాన్ జలసంధిలో సైనిక కార్యకలాపాలు పెరిగాయి. తాజాగా చైనా తన మోహరింపులపై బుధవారం స్పందించింది. తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకొంటామని చెప్పింది. వేర్పాటువాద కార్యకలాపాలను ఏమాత్రం సహించమని పేర్కొంది. చైనాలోని తైవాన్ అఫైర్స్ ఆఫీస్ విభాగం ప్రతినిధి ఝుఫెంగ్లియాన్ మాట్లాడుతూ "తైవాన్ వేర్పాటువాదులు బాహ్యశక్తులతో కుమ్మక్కయ్యే చర్యలపై బీజింగ్ అత్యంత అప్రమత్తంగా ఉంది. మా దృష్టిలోకి రానిది ఏదీ జరగనీయం. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటానికి, తైవాన్ జలసంధిలో సుస్థిరత నెలకొల్పడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకొంటాం" అన్నారు. మరోవైపు ఈ మోహరింపులు ఎందుకోసమనే అంశంపై పీఎల్ఏ ఎటువంటి ప్రకటన చేయలేదు. ఇటీవల తైవాన్ అధ్యక్షుడు లాయ్ చింగ్ తె అమెరికాకు చెందిన హవాయి, గువామ్‌లో పర్యటించారు. ఈ చర్యలు బీజింగ్‌కు తీవ్ర ఆగ్రహం కలిగించాయి. ఈనేపథ్యంలో తైవాన్ చుట్టుపక్కల భారీగా సైనిక మోహరింపులు మొదలుపెట్టింది. దీనిపై తైవాన్ సీనియర్ అధికారి ఒకరు ఆంగ్లవార్తా సంస్థతో మాట్లాడుతూ.. అమెరికాలో కొత్తగా బాధ్యతలు స్వీకరించనున్న కార్యవర్గానికి ఓ రాజకీయ సందేశం పంపడం కోసం బీజింగ్ ఇలా చేస్తోందని అభిప్రాయపడ్డారు. దాదాపు 70 రోజులపాటు చైనా సైన్యం ప్లానింగ్ చేసి ఆ మేరకు తాజాగా మోహరింపులు చేపట్టిందని తైవాన్ మిలిటరీ అంచనా వేసింది. ఇప్పటికే తైవాన్ అధ్యక్షుడు లాయ్ ప్రభుత్వం తమ దేశంపై బీజింగ్ సార్వభౌమ హక్కులను కొట్టిపారేసింది. మంగళవారం తైవాన్ రక్షణ మంత్రిత్వశాఖ స్పందిస్తూ.. గత మూడు దశాబ్దాల్లో ఎన్నడూ లేని స్థాయిలో బీజింగ్ తన నౌకాదళాన్ని మోహరించిందని వెల్లడించింది. గతంలో చైనా చేసిన యుద్ధ విన్యాసాల కంటే ఇది తీవ్రమైన ముప్పుగా మారిందని పేర్కొంది.




బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీలపై దాడులు జరుగుతుండటంతో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో కేవలం సంప్రదింపులతోనే అక్కడి సమస్య పరిష్కారం కాదని ఆర్‌ఎస్ఎస్ నేత సునీల్ అంబేకర్ పేర్కొన్నారు. నాగ్‌పూర్‌లో నిర్వహించిన సకల హిందూ సమాజ్ సభలో ఆయన ఈమేరకు వ్యాఖ్యానించారు. 'కేంద్రం గట్టిగా ప్రయత్నించి కచ్చితమైన చర్యలు తీసుకోవాలి. చర్చలతో సమస్యను పరిష్కరించవచ్చని నేను ఆశిస్తున్నా. అలా కుదరకపోతే మరొక పరిష్కారాన్ని కనుగొనండి. నోబెల్ శాంతి బహుమతి అందుకున్న వ్యక్తి (మహ్మద్ యూనస్) నడుపుతున్న దేశంలో శాంతి లేదు' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితులను ఆయన ప్రస్తావించారు. బంగ్లాదేశ్ జెండాను అగౌరవపరిచారనే ఆరోపణలపై చిన్మయ్ కృష్ణదాస్ ను ఢాకా పోలీసులు అరెస్టు చేయడం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ అరెస్టును వ్యతిరేకిస్తూ అక్కడి హిందువులు పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. ఈ నిరసనల్లో ఓ న్యాయవాది మరణించారు. ఈ క్రమంలో అక్కడి హిందువులు, ఇతర మైనారిటీలపై జరుగుతున్న దాడులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇదే విషయాన్ని భారత్ విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అక్కడి ప్రభుత్వానికి తెలియజేశారు. ఇటీవల ఢాకా వెళ్లిన ఆయన ఆ దేశ విదేశాంగ శాఖ కార్యదర్శి మహమ్మద్ జషీమ్ ఉద్దీన్‌తో సమావేశమయ్యారు. తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్‌తోనూ మిస్రీ భేటీ అయ్యారు.

**మైనారిటీలపై 88 హింసాత్మక ఘటనలు: బంగ్లాదేశ్...** ఈ భేటీ మరుసటి రోజే బంగ్లాదేశ్ దాడులకు సంబంధించిన నివేదికను బయటపెట్టింది. షేక్ హసీనా రాజీనామా అనంతరం ఆగస్టు 5నుంచి అక్టోబరు 22 మధ్యకాలంలో మైనారిటీలపై 88 మతపరమైన హింసాత్మక ఘటనలు జరిగిన్నట్లు బంగ్లాదేశ్ పేర్కొంది. ఈ ఘటనకు సంబంధించిన కేసుల్లో 70 మందిని అరెస్టు చేసినట్టు వెల్లడించింది.

# ఏపీని పునర్నిర్మించేందుకు కలిసి పనిచేద్దాం



అమరావతి, డిసెంబర్ 11: ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా కలెక్టర్ల సమావేశంలో చర్చించాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బుధవారం ఏపీ కలెక్టర్ల సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. 1994 నుంచి సీఎం చంద్రబాబుతో ప్రయాణం చేస్తున్నానని.. చంద్రబాబు మొదటిసారి సీఎం అయినప్పుడు ఎంత తపనతో పని చేశారో ఇప్పుడూ అదే తపనతో ముందుకెళ్తున్నారన్నారు. ప్రజల కోసమే జీవితం, ప్రతి పనిలోనూ మానవత్వం అనే లక్ష్యంతో పాలన అందిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వారసత్వంగా వచ్చిన ప్రధాన సమస్య రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల అప్పు అని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి నెలలో 99 శాతం రాష్ట్ర ఆదాయం జీతభత్యాలకే సరిపోయిందన్నారు. అంతకుముందు రెండేళ్లు 107 శాతం రాష్ట్ర ఆదాయం జీతభత్యాలకే వెచ్చించారని చెప్పారు. ఒక లక్షా 14 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వంలో ప్రతి వ్యవస్థను నిర్వీర్యం చేశారని.. వాస్తవ పరిస్థితులు చూస్తే చాలా బాధనిపిస్తోందని అన్నారు. అధికారంలోకి రాగానే అప్పులు, ఆగిపోయిన ప్రాజెక్టులు, మరోవైపు ప్రజల ఆశలు ఆకాంక్షలు ఎదురయ్యాయని తెలిపారు. మరో వ్యక్తి అయితే నిద్రపోలేని పరిస్థితి కానీ సీఎం చంద్రబాబు ప్రజాక్షేమమే ధ్యేయంగా కష్టపడుతున్నారన్నారు. . హైదరాబాద్ ట్రాన్స్ ఫార్మ్ చేసినట్టే రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తారన్నారు. ప్రభుత్వశాఖలు ప్రతీ రూపాయినీ జాగ్రత్తగా ఆలోచించి ఖర్చుపెట్టాలని సూచించారు. ఈ రాష్ట్రాన్ని పునర్నిర్మించడానికి అంతా కలసి పని చేద్దామన్నారు. సీఎం టీమ్‌గా ప్రజల కోసం పనిచేద్దామంటూ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు.

# వైఎస్ బిడ్డగా అవకాశం ఇస్తే.. ఇలా చేస్తారా



విజయవాడ, డిసెంబర్ 11: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ ఆర్థిక స్కాంపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. 2019-24 మధ్య ఏపీని అన్ని విధాలా నాశనం చేశారని మండిపడ్డారు. వైఎస్ బిడ్డగా అవకాశం ఇస్తే అడ్డగోలుగా దోచేశారని ఆరోపించారు. ఈసారి రెండు స్థానాలు కూడా జగన్‌కు వచ్చే అవకాశం లేదన్నారు. జగన్ చేసిన అన్ని స్కాంల పైన ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను పెట్టాలని సీఎంను కోరుతున్నామన్నారు. వైసీపీ నాయకులు చాలా మంది దుర్మార్గంగా వ్యవహరించారన్నారు. కాకినాడ పోర్ట్‌ను కేవీ రావును బెదిరించి లాక్కున్నారన్నారు. వాటిపై విచారణ చేసి కేవీ రావుకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. జగన్ - అదానీ మధ్య జరిగిన ఒప్పందంలో రూ.1750 కోట్లు అవినీతి జరిగిందన్నారు. జగన్ డబ్బులు తీసుకున్నట్లు దర్యాప్తు సంస్థలు నిర్ధారించాయన్నారు. ఈ స్కాంపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దోపిడీలు చేసి ఎవరికి వారు ఆర్థికంగా దోచుకుంటే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వాట్సప్ ద్వారా 153 పౌరసేవలు అందించేలా కార్యాచరణ సిద్ధం: మంత్రి లోకేశ్



అమరావతి: వాట్సప్ ద్వారా పౌరసేవలు అందించే అంశంపై కలెక్టర్ల సదస్సులో మంత్రి నారా లోకేశ్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఇక నుంచి వెబ్‌సైట్ ద్వారా ప్రభుత్వ సమాచారం అంతా వచ్చేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జనన మరణాల ధ్రువ పత్రాల జారీకి పాటిస్తున్న విధానంపై సమీక్షించాలన్నారు. విద్యాశాఖలో ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ ఎకౌంట్ రిజిస్ట్రీ(అపార్) ఐడీ జారీ సమయంలో ఎదురైన ఇబ్బందులను ప్రస్తుతం మార్పు చేసి సరి చేస్తున్నట్లు తెలిపారు. విధానాలను సగం నుంచి డిజిటలైజ్ చేయటమే కాకుండా పూర్తిగా వాటి ప్రాసెస్‌ను రీ-ఇంజినీరింగ్ చేయాల్సి ఉందని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచంలో యూఏఈ మాత్రమే ఒకే ప్లాట్ ఫాంపై పౌర సేవలు అందిస్తోందన్నారు. ప్రభుత్వ సమాచారం ఒకే చోట ఉండేలా https://www.ap.gov.in%/#/ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని వెల్లడించారు. 153 పౌర సేవలు వాట్సప్ ద్వారా ఇచ్చేందుకు వీలుగా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు.




# ఒళ్లు హూనమైనా రెండు గంటలు ఆ పని తప్పనిసరి!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హార్డ్ వర్క్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ప్రతీ సినిమాలోనూ అతడి కష్టం తెరపై కనిపి స్తుంది. అందుకే అంత పెద్ద స్టార్ అయ్యాడు. జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డులు..రివార్డులు అందుకున్నాడు. అలాగే బన్నీ మంచి ఫిట్ నెస్ ప్రియుడు కూడా. నిత్యం తనని పిట్ గా ఉండేలా చూసుకుంటాడు. క్రమం తప్పకుండా రెండు పూటలా జిమ్ చేయడం అలవాటు. అలాగే ఆహారం విషయంలోనే అంతే జాగ్రత్తలు తీసుకుంటాడు. అలాగని అతడికి ఆకలేస్తే స్టార్ హెూటల్ లోనే తినాలనే మి ఉండదు. పూరి గుడిసెలోనైనా? సమయానికి తనకి కావాల్సిన ఆహారం తీసుకుంటాడు. అది అతడిలో ఉన్న గొప్ప లక్షణం. అతడిలో ఉన్న డౌన్ టూ ఎర్త్ క్వాలిటీ. ఇది అందరికీ తెలిసిందే. సాధారణంగా ఉదయం నుంచి



సాయంత్ర వరకూ షూట్ లో పాల్గొంటే అలసిపోతారు .అలాంటి సమయంలో మళ్లీ జిమ్ చేయడం అన్నది సాధ్యం కాదు. కానీ బన్నీ అలాంటి టైప్ కాదు. ఎంత అలసిపోయినా? సరే సాయంత్రం ఇంటికొచ్చి రెండు గంటల పాటు జిమ్ క్రమం తప్పకుండా చేస్తాడు. ఇన్ డోర్ షూటింగ్ అయినా..ఔట్ డో ర్ షూటింగ్ అయినా జిమ్ మాత్రం మిస్ అవ్వడుట. పుష్ప-2 షూటింగ్ సమయంలో సాయంత్ర వరకూ అడవిలో షూటింగ్ చేసినా..ఎంతో కఠినమైన షూటింగ్ జరిగినా... షూటింగ్ లో ఒళ్లు హూనమైపోయినా? హెూటల్ కి వచ్చిన వెంటనే జిమ్ కి వెళ్లిపోయేవాడని రష్మిక మందన్న ఓ ఇంటర్వ్యూలో రివీల్ చేసింది. అతడిలో ఆ రకమైన డెడికేషన్ చూసి ఫిదా అయిపోయానని సంతోషం వ్యక్తం చేసింది. ఐదేళ్ల పాటు ఒకే హీరోతో కలిసి నటించడం తన కెరీర్ లో ఇదే మొదటిసారని తెలిపింది. పుష్ప మొదటి, రెండు భాగాల్లో బన్నీకి జోడీగా రష్మిక నటించిన సంగతి తెలిసిందే. రెండు సినిమాలు పాన్ ఇండియాలో బ్లాక్ బస్టర్ అయ్యాయి. ముఖ్యంగా రెండవ భాగమైతే ఇప్పుడెలాంటి దూకుడు చూపిస్తుందో తెలిసిందే.

## స్టార్ నటుడి వారసుడి పెళ్లి సందడి

తెలుగుతో పాటు తమిళ్, మలయాళం భాషల్లో ఎన్నో సినిమాల్లో నటించి విలక్షణ నటుడిగా పేరు సొంతం చేసుకున్న జయరామ్ వారసుడు కాళిదాస్. ఈయన కూడా నటుడి గా ఇండస్ట్రీలో అడుగు పెట్టాడు. ముఖ్యంగా కోలీవుడ్‌లో ఈయన హీరోగా సినిమాలు చేయడంతో పాటు కొన్ని సినిమాల్లో ముఖ్య పాత్రల్లో కనిపించాడు. ఇటీవల ధనుష్ హీరోగా నటించి స్వీయ దర్శకత్వంలో రూపొందించిన రాయన్ సినిమాలో కాళిదాస్ ముఖ్య పాత్రలో నటించి మెప్పించిన విషయం తెల్సిందే. హీరోగానే కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్టుగా సినిమాలు చేయడం మంచి విషయం. జయరామ్ సైతం ఎన్నో సినిమాల్లో ముఖ్య పాత్రల్లో నటించడంతో మంచి పేరును సొంతం చేసుకున్నారు. ముఖ్యంగా ఆయన గుంటూరు కారం సినిమాతో పాటు అల వైకుంఠపురం సినిమాలో నటించారు. ఆ రెండు సినిమాల్లోనూ



జయరామ్‌కి త్రివిక్రమ్ చాలా ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఇవ్వడం జరిగింది. ఆ సినిమాలతో పాటు మరికొన్ని తమిళ సినిమాలను సైతం చేశాడు. టాలీవుడ్‌లో ముఖ్య పాత్రలకు జయరామ్ మోస్ట్ వాంటెడ్‌గా నిలిచిన విషయం తెల్సిందే. ఇప్పుడు జయరామ్ తనయుడు కాళిదాస్ పెళ్లి పీటలు ఎక్కడంతో వార్తల్లో నిలిచాడు. మోడలింగ్‌లో సుదీర్ఘ కాలంగా కొనసాగుతూ ఉన్న తరణితో కాళిదాస్ వివాహం జరిగింది. తరణి అందాల పోటీల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా మిస్ తమిళనాడు, మిస్ సౌత్ ఇండియా పోటీల్లో పాల్గొని రన్నరప్‌గా నిలవడం జరిగింది. గత కొంత కాలంగా తరణితో కాళిదాస్ ప్రేమ వ్యవహారం సాగుతోంది. ఇద్దరి మధ్య ప్రేమెకు సంబంధించిన వార్తలు కోలీవుడ్ మీడియాలో గతంలో ఒకటి రెండు సార్లు వచ్చాయి.

చెన్నైలో ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్ జరిగాయి, నేడు ఉదయం సింపుల్‌గా ప్రముఖుల సమక్షంలో వివాహం జరిగింది. వీరి వివాహ వేడుకకి సంబంధించిన ఫోటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. నటుడిగా కాళిదాస్ త్వరలోనే తెలుగు సినిమాల్లోనూ నటించే అవకాశాలు ఉన్నాయని ఆ మధ్య ఒక ఇంటర్వ్యూలో జయరామ్ పేర్కొన్నారు. మంచి పాత్రలతో అలరించడం ద్వారా హీరో స్థాయి ఇమేజ్‌ను సొంతం చేసుకునే అవకాశం ఉంటుంది. అందుకే కాళిదాస్ హీరో పాత్రలనే కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్టుగానూ సినిమాలు చేస్తున్నారు.

## బిగ్ బాస్ 8 : గ్రాఫ్ తగ్గినా వెనక్కి తగ్గని కంటెస్టెంట్.. టాప్ 3 ఫిక్స్..!




బిగ్ బాస్ సీజన్ 8 లో సీజన్ మొదటి నుంచి చివరి దాకా చూస్తే ప్రతి వారం పడుతూ లేస్తూ హౌస్ మెట్స్ తో ఫైట్ చేస్తూ కలిసిపోతూ ఇలా అన్ని విధాలుగా సీరియల్ యాక్టర్ ప్రేరణ ఆడియన్స్ ని బాగా ఎంటర్టైన్ చేసిందని చెప్పొచ్చు. మొదటి ఐదు వారాలు ఆటలో అదరగొడుతూ వచ్చిన ప్రేరణ ఆ తర్వాత మధ్యలో కాస్త డల్ అయినట్టు అనిపించింది.

ముఖ్యంగా కిచెన్ డిపార్ట్ మెంట్ లో ఉంటూ దోశల దగ్గర కర్రీల దగ్గర హౌస్ మెట్స్ తో పోట్లాడేది. దాని వల్ల ప్రేరణకు ఎక్కువ నామినేషన్స్ కూడా పడ్డాయి. కానీ టాస్కుల విషయానికి వస్తే ప్రేరణ ఫుల్ ఫైట్ చేసింది. దాని వల్లే ఆమె ఈ సీజన్ లో ఒక్కగానొక్క లేడీ ఫైనలిస్ట్ అయ్యింది. ఈ సీజన్ లో టాప్ 5 ఎవరెవరు అవుతారా అన్నది కూడా లాస్ట్ సండే ఎలిమినేషన్ వరకు సస్పెన్స్ నడిచింది. ఐతే ఇప్పుడున్న టాప్ 5 కచ్చితంగా అర్హులు అనిపించేలా చేశారు ఆడియన్స్. ముఖ్యంగా ప్రేరణ ఆడపులిలా టాస్కులు ఆడుతూ అందరినీ మెప్పిస్తూ వచ్చింది. ఇక ప్రస్తుతం హౌస్ లో ఈ వారం మొత్తం ఎంటర్టైన్మెంటే ఉండగా.. మంగళవారం ఎపిసోడ్ లో సీరియల్ యాక్టర్ కావ్య రాగా ఆమె కోసం చంద్రముఖిలో గంగగా చేసి అదరగొట్టింది ప్రేరణ. అవినాష్ తో కలిసి ఆడియన్స్ ని ఎంటర్టైన్ చేసింది. ఐతే ఈ సీజన్ లో నిఖిల్, గౌతం లు టాప్ 2 గా ఫిక్స్ అవ్వగా టాప్ 3 పొజిషన్ లో ప్రేరణ ఉన్నట్టు తెలుస్తుంది. చివరి రెండు ప్లేస్ లలో అవినాష్, నబీల్ ఉన్నారు. ఐతే ప్రేరణ ఇంకాస్త ట్రై చేస్తే కచ్చితంగా టాప్ 2 కి వెళ్లినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని చెప్పొచ్చు. బిగ్ బాస్ సీజన్ 8 లో ప్రేరణ ది బెస్ట్ కంటెస్టెంట్ అని చెప్పడంలో ఎలాంటి డౌట్ లేదు. ఇక ఈరోజు నుంచి బిగ్ బాస్ హౌస్ లో టాప్ 4 కంటెస్టెంట్స్ ఏవీలు ప్లే చేస్తారని తెలుస్తుంది.

ఏవీల తర్వాత బిగ్ బాస్ మిగతా కంటెస్టెంట్స్ తో పార్టీ ఆ తర్వాత ఫైనల్ ఎపిసోడ్ జరుగుతుంది. డిసెంబర్ 15న బిగ్ బాస్ సీజన్ 8 ఫైనల్ ఎపిసోడ్ ఉండబోతుంది.

## పని చేయని ఆలియా ఫ్యాక్టర్ ట్రిప్తి ఫ్యాక్టర్



పరిశ్రమలో అగ్ర కథానాయికగా హవా సాగిస్తోంది ఆలియా భట్. తాను నటించిన జిగ్రా ఇటీవలే థియేట్రికల్ గా విడుదలై నిరాశపరిచిన సంగతి తెలిసిందే. అన్నా చెల్లెళ్ల సెంటిమెంట్, జైల్ బ్రేక్ కాన్సెప్ట్ తో రూపొందించిన ఈ సినిమాకి వసంత్ బాలా దర్శకత్వం వహించగా ప్రేక్షకులు తిరస్కరించారు. ఇప్పుడు ఓటీటీలోను అదే పరిస్థితి కనిపిస్తోంది. పెద్ద తెర - ఓటీటీ తెర రెండుచోట్లా ఈ చిత్రం నిరాదరణకు గురైంది. ఇక జిగ్రాతో పాటే ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్న విక్కీ విద్యా క వో వాలా పరిస్థితి అందుకు భిన్నంగా లేదని టాక్ వినిపిస్తోంది. ఈ రెండు సినిమాలు యాధృచ్ఛికంగా నెట్ ఫ్లిక్స్ లోకి వచ్చాయి. కానీ ఇవి ఏవీ ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. %-%విక్కీ విద్యా క వో వోలా వీడియో%-% చిత్రంలో ట్రిప్తి దిమ్రీ గ్లామరస్ యాక్ట్ కూడా దీనిని కనీస మాత్రంగా కాపాడలేకపోయింది. డ్రీమ్ గర్ల్ లాంటి కాన్సెప్ట్ బేస్డ్ సినిమాతో ఆకట్టుకున్న రాజ్ శాండిల్య ఆశించిన విజయం అందుకోలేకపోయాడు. విక్కీ విద్యా కా వో వాలా వీడియో ఓటీటీ ఆడియెన్ నుంచి కూడా ప్రతికూల స్పందనలు అందుకుంది. అడల్ట్ కామెడీ కేవలం ఒక వర్గం ప్రేక్షకులకు మాత్రమే కనెక్టవ్వగా, ఫ్యామిలీ ఆడియెన్ కి విసుగొచ్చిందన్న టాక్ వినిపించింది. ముఖ్యంగా ట్రిప్తి దిమ్రీ గ్లామర్ ఎలివేషన్ .. డ్యాన్సులు కూడా ఆశించిన స్థాయిలో ఆడియెన్ కి కనెక్ట్ కాకపోవడం కూడా ఈ ఫ్లాప్ కి కారణమని చెబుతున్నారు. విక్కీ వోలా.. చిత్రంలో రాజ్ కుమార్ రావు లాంటి సీనియర్ నటుడు నటించినా కానీ, ఎందుకనో ఆశించిన ఫలితం దక్కలేదు. జిగ్రాను ఆలియా ఫ్యాక్టర్.. విక్కీ వోలాను ట్రిప్తి ఫ్యాక్టర్ కాపాడలేకపోయాయని దీనిని బట్టి అంగీకరించాలి.

## కీర్తి సురేష్ కూడా రష్మిక రూట్లోనే..

'మహానటి' సినిమాతో ఉత్తమ నటిగా నేషనల్ అవార్డుని కీర్తి సురేష్ అందుకున్న విషయం తెలిసిందే. ఇక ఈ సినిమాతో మలయాళీ ముద్దుగుమ్మ కీర్తి సురేష్ తెలుగు వారికి ఇష్టమైన కథానాయిక అయిపోయింది. అయితే 2013లోనే కీర్తి హీరోయిన్ గా మాతృభాష మలయాళంలో అరంగేట్రం చేసింది. 2015లో తమిళంలోకి ఎంట్రీ ఇచ్చింది. ఇక 2016లో 'నేను శైలజ' చిత్రంతో తెలుగులోకి అడుగుపెట్టింది. ఆ మూవీ సూపర్ హిట్ అయ్యింది. తరువాత 'నేను లోకల్' తో మరో సక్సెస్ ని అందుకుంది. మూడో సినిమానే ఏకంగా పవన్ కళ్యాణ్ తో చేసే ఛాన్స్ ని 'అజ్ఞాతవాసి' మూవీతో కీర్తి సురేష్ అందుకుంది. అయితే ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. 2018లో వచ్చిన 'మహానటి' మూవీ ఆమెకి ఏకంగా బెస్ట్ యాక్టర్ గా నేషనల్ అవార్డు తెచ్చిపెట్టింది. ఆ సినిమాతో స్టార్ హీరోయిన్ గా కీర్తి సురేష్ మారిపోయింది. తెలుగు, తమిళ్, మళయాళ భాషలలో వరుస సినిమాలు చేస్తూ బిజీ అయిపోయింది. అయితే కీర్తి సురేష్ నటిగా తన పెర్ఫార్మెన్స్ తో అందరికి చేరువ అయిన కమర్షియల్ హీరోయిన్ అనే ముద్ర వేసుకోలేకపోయింది. ఎక్కువగా ఆమె పక్కింటి అమ్మాయి తరహా పాత్రలలోనే కనిపించింది. సూపర్ స్టార్ మహేష్ బాబుకి జోడీగా నటించిన 'సర్కారు వారి పాట' సినిమాతో కీర్తి సురేష్ రూట్ మార్చింది. అప్పటి నుంచి గ్లామర్ రోల్స్ చేయడం



మొదలు పెట్టింది. ఇక కీర్తి సురేష్ కంటే ఆలస్యంగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన రష్మిక మందన ఓ వైపు పెర్ఫార్మెన్స్ కి స్కోప్ ఉన్న క్యారెక్టర్స్ చేస్తూనే గ్లామర్ రోల్స్ కి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కమర్షియల్ మూవీస్ లలో కూడా పెర్ఫార్మెన్స్ పరంగా అందరిని మెప్పించసాగింది. దీంతో చాలా వేగంగా ఈ బ్యూటీ స్టార్ హీరోయిన్ అయిపోయింది. 'గీతాగోవిందం', 'భీష్మ', 'సరిలేరు నీకెవ్వరూ' లాంటి సినిమాలతో టాప్ చైర్ లోకి రష్మిక వచ్చేసింది. 'పుష్ప' మూవీ పూర్తిగా ఆమె ఫేట్ ని మార్చేసింది. నేషనల్ వైడ్ గా ఆమెకి పుష్ప క్రేజ్ తీసుకొచ్చింది. తరువాత 'యానిమల్' సినిమాలో ఓ వైపు పెర్ఫార్మెన్స్ తో అందరిని మెప్పిస్తూనే మరో వైపు బోల్డ్ ఇంటిమెంట్ సన్నివేశాలలో నటించి స్టార్ హీరోయిన్ గా పెర్ఫెక్ట్ ఛాయస్ అనిపించుకుంది. 'పుష్ప 2' మూవీతో ఇప్పుడు మరో సూపర్ సక్సెస్ ని అందుకోబోతోంది. నెక్స్ట్ హిందీలో ఛత్రపతి శంభాజీ మహారాజ్ బయోపిక్ తో వస్తోన్న ఛావా మూవీతో ప్రేక్షకుల ముందుకి రాబోతోంది. విక్కీ కౌశల్ ఈ మూవీలో టైటిల్ రోల్ పోషించారు. దీంతో పాటు మరో హిందీ సినిమాలో ఛాన్స్ అందుకుంది. అలాగే తెలుగులో రెండు సినిమాలు చేస్తోంది. ప్రస్తుతం సౌత్ లో హైయెస్ట్ పెయిడ్ హీరోయిన్స్ లలో ఒకరుగా రష్మిక ఉంది. ఇప్పుడు కీర్తి సురేష్ కూడా రష్మిక బాటలోకి వచ్చినట్లు తెలుస్తోంది. 'బేబీ జాన్' సినిమాతో కీర్తి హిందీలోకి అడుగుపెడుతోంది. ఈ సినిమా నుంచి రీసెంట్ గా వచ్చిన సాంగ్ లో ఆమె గ్లామర్ షోతో ఎట్రాక్ట్ చేసింది. ఈ చిత్రంతో బాలీవుడ్ ఆడియన్స్ ని మెస్మరైజ్ చేస్తే పాన్ ఇండియా హీరోయిన్స్ రేసులోకి కీర్తి సురేష్ వచ్చే ఛాన్స్ ఉందని సినీ విశ్లేషకులు అంటున్నారు. మరి అమ్మడు భవిష్యత్తు అడుగులు ఎలా ఉంటాయో చూడాలి.

## విజయ్ దేవరకొండ 'గర్ల్ ఫ్రెండ్'..!

రష్మిక మందన్న హీరోయిన్‌గా దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న 'గర్ల్ ఫ్రెండ్' సినిమా షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్ వచ్చి ఆకట్టుకుంది. సినిమా పై అంచనాలు పెంచే విధంగా టీజర్ రాబోతుంది. గత రెండు మూడు రోజులుగా గర్ల్ ఫ్రెండ్ టీజర్‌ను విజయ్ దేవరకొండ చేతుల మీదుగా విడుదల చేయించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి అంటూ వార్తలు వచ్చాయి. ఇప్పుడు అదే విషయాన్ని నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. విజయ్ దేవరకొండ చేతుల మీదుగా గర్ల్ ఫ్రెండ్ టీజర్ రాబోతుంది అంటూ పోస్టర్‌ను విడుదల చేసి మరీ మేకర్స్ అఫిషియల్ అనౌన్స్మెంట్ చేయడం జరిగింది. గత కొన్నాళ్లుగా రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ప్రేమలో ఉన్నారు అంటూ ప్రచారం జరుగుతోంది. ఇద్దరూ ఆ విషయాన్ని గురించి బాహాటంగా స్పందించకుండా ముసుగులో గుద్దులాట అన్నట్లుగా చేస్తున్నారు. ఇటీవల పుష్ప 2 సినిమాకి విజయ్ దేవరకొండ ఫ్యామిలీతో కలిసి రష్మిక వెళ్లడం




జరిగింది. ఆ మధ్య ఇద్దరూ ఒక డిన్నర్ డేట్‌కి వెళ్లడం తెలిసిందే. మొత్తానికి ఇద్దరి మధ్య వ్యవహారం నడవడం లేదు పరిగెడుతోందని అంతా బలంగా నమ్ముతున్నారు. ఈ సమయంలో విజయ్ దేవరకొండ చేతుల మీదుగా తన గర్ల్ ఫ్రెండ్ రష్మిక మందన్న సినిమా అయిన 'గర్ల్ ఫ్రెండ్' టీజర్‌ను విడుదల చేయడం అనేది కచ్చితంగా అందరి దృష్టిని ఆకర్షించడం ఖాయం. గర్ల్ ఫ్రెండ్ సినిమా గురించి పుష్ప 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ లో సుకుమార్ మాట్లాడుతూ కొన్ని సీన్స్ చూశాను, చాలా బాగా వచ్చాయి. బెస్ట్ యాక్టింగ్ స్కిల్స్‌ను రష్మిక ప్రదర్శించింది అంటూ చెప్పుకొచ్చిన విషయం తెల్సిందే. సుకుమార్ వ్యాఖ్యలతో గర్ల్ ఫ్రెండ్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. ఇప్పుడు విజయ్ దేవరకొండ చేతుల మీదుగా టీజర్ రాబోతున్న కారణంగా అంచనాలు మరింత పెరగడం ఖాయం. టీజర్ విడుదల తర్వాత ఇన్నాళ్లు శ్రీవల్లి అంటూ పిలవబడిన రష్మిక మందన్న ఆ తర్వాత నుంచి గర్ల్ ఫ్రెండ్ అంటూ అందరితో పిలిపించుకుంటుందేమో చూడాలి. సోషల్ మీడియాలో ఇప్పటికే పుష్ప 2 కి గాను రష్మికకి జాతీయ అవార్డు రావడం ఖాయం అంటూ ప్రచారం చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా రష్మిక మందన్న పుష్ప 2 లో డాన్స్‌లతో కుమ్మేసింది. అల్లు అర్జున్‌తో పోటీ పడి మరీ డాన్స్‌లు వేసినట్లుగా ఫ్యాన్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు. గత ఏడాది గీతాంజలిగా, ఈ ఏడాది శ్రీవల్లిగా ఉమెన్ పవర్‌ను చూపించిన రష్మిక మందన్న గర్ల్ ఫ్రెండ్ సినిమాతో మరింత విజయాన్ని సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయి.



# 14న సీఎం చేతుల మీదుగా దొడ్డి కొమురయ్య ఆత్మగౌరవ భవనం ప్రారంభం

హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం కోకాపేటలో నిర్మించిన దొడ్డి కొమరయ్య కురుమ సంఘ ఆత్మగౌరవ భవనాన్ని డిసెంబర్ 14న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాకాలు చేస్తున్నారు. సభ ఏర్పాట్లపై మంగళవారం సచివాలయంలో బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్షించారు.



# తెలంగాణ చరిత్రను మార్చాలని చూస్తున్నారు: మాజీ మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డి: ఇచ్చిన మాట ప్రకారం 2009లోనే రాష్ట్రం ఇచ్చి ఉంటే కేసీఆర్ ఉద్యమం చేసేవారు కాదని మాజీమంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004 నుంచి 2014 వరకు రాష్ట్రం, కేంద్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ కాదా?అని ప్రశ్నించారు. "తెలంగాణ ఇస్తామని 2004-2009 మధ్య మాతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంది. పొత్తు పెట్టుకుని తెలంగాణ ఇవ్వకుండా కాంగ్రెస్ మోసింది. రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నిరాహార దీక్ష చేశారు. నవంబరు 29 లేకపోతే డిసెంబరు 9 ప్రకటన లేదు. సోనియా గాంధీ దయ తలచి తెలంగాణ ఇచ్చారంటున్నారు. ఎవరో భిక్ష వల్ల తెలంగాణ రాలేదు. కేసీఆర్ వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చింది. తెలంగాణ ప్రజల పోరాట ఫలితంగా రాష్ట్రం ఏర్పడింది.

రేవంత్‌రెడ్డి ఎప్పుడైనా ఉద్యమంలో పాల్గొన్నారా? అందరు ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని జేఏసీ ఛైర్మన్ పిలుపునిస్తే రేవంత్‌రెడ్డి చేయలేదు. తెలంగాణ చరిత్రను మార్చాలని చూస్తున్నారు" అని హరీశ్‌రావు విమర్శించారు.

# ఎమ్మెల్యేలను ప్రజలకు దూరం చేస్తోంది వారే.. గుత్తా సంచలన కామెంట్స్

హైదరాబాద్, డిసెంబర్ 11: ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు శిక్షణ తరగతులతో ప్రజాప్రతినిధులకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచనలు చేశారు. బుధవారం ఎమ్‌సీహెచ్‌ఆర్‌డీలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు ప్రజలకు దూరం అవ్వడానికి, ఎన్నికల్లో ఓడిపోవడానికి ప్రధాన కారణం పీఏలు, పీఆర్‌ఓలు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలతో ప్రజాప్రతినిధులను దూరం చేయడానికి మొదటి కారణం పీఏలు, పీఆర్‌ఓలు అంటూ వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే కోసం ఎవరైనా ఫోన్ చేస్తే పీఏలు, పీఆర్‌ఓలు దురుసుగా మాట్లాడుతారన్నారు. కాబట్టి ఎమ్మెల్యేలు ఫోన్లో అందరితో టచ్‌లో ఉండాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచనలు చేశారు. ప్రస్తుత రాజకీయాలను చూస్తే ఆవేదన కలుగుతోందన్నారు.ర గాలివాటం రాజకీయాలు మొదలయ్యాక కొత్త ఎమ్మెల్యేలే సభలోకి వస్తున్నారన్నారు. "మన ఫోన్లు మనమే ఎత్తుకోవడం అలవాటు చేసుకోవాలి. మన పీఏ, పీఆర్‌ఓలు కూడా ఫోన్లు వస్తే కసురుకుంటున్నారు. గన్ మెన్‌లతో కూడా ప్రజల్లో కొంత వ్యతిరేకత వస్తోంది. గెలవగానే పక్కకి వచ్చి చేరే వాళ్ళతో జాగ్రత్తగా ఉండాలి. ఎన్నికలు కాస్ట్లీగా మారిపోయాయి. మేం సభాపతిగా ఉన్నా సభ ఎన్ని రోజులు నడపాలనే నిర్ణయం ప్రభుత్వానిది. ప్రభుత్వం ఎక్కువ రోజులు సభ నిర్వహించాలనుకుంటే ఎక్కువ రోజులు నడుస్తుంది" అంటూ గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు.

**ఆ అవార్డును పరిశీలిస్తున్నాం: స్పీకర్...** చట్టాలను రూపొందించే హక్కు శాసన సభ్యులకు ఉంటుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే శిక్షణా తరగతుల్లో స్పీకర్ మాట్లాడుతూ.. గతంలో శాసనసభ సమావేశాలు ఉంటే సినిమా రిలీజ్ వాయిదా వేసుకునేవారన్నారు.

ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖర్ రెడ్డి లాంటి గొప్ప వ్యక్తులు బాగా మాట్లాడి మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ఉత్తమ



పార్లమెంటరీయన్ లెక్క ఉత్తమ శాసనసభ వ్యక్తి అవార్డు పరిశీలన చేస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్ వెల్లడించారు.

**శాసనసభ ఏ ఒక్కరిదో కాదు: మంత్రి శ్రీధర్ బాబు** : మొదటిసారి ఎన్నికైన శాసనసభ్యులు 57 మంది శాసన సభలో ఉన్నారని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శాసనసభ అందరికీ అని... కాంగ్రెస్, బీఆర్ఎస్‌దో వేరే ఇంకా ఎవరిదో కాదన్నారు. శాసనసభ ఏ ఒక్కరిదో కాదని... ఈ ట్రైనింగ్ సెషన్స్‌కు అందరికీ ఆహ్వానం పంపామని తెలిపారు. పాత రోజుల్లో సిద్ధాంతపరంగా భేదాభిప్రాయాలు ఉన్నా... సభలో ఎవరి పాత్ర వారు పోషించారన్నారు. "నేను మొదటిసారి ఎన్నికైనప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నది. నేను నాలుగోసారి సభలో ఉన్నప్పుడు పీఏసీ ప్రతిపక్షానికి ఇవ్వలేదు. ఎమ్మెల్యేలు అందరూ శాసనసభకు హాజరయ్యే సాంప్రదాయం కొనసాగించాలి. ఎమ్మెల్యేగా గెలిచి సభ రాకుండా దూరంగా ఉండకండి. ఎప్పుడు మాట్లాడే అవకాశం దొరుకుతుందా అనే దాని కోసం చూసే వాళ్ళం" అని మంత్రి శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు. కాగా.. రెండు రోజుల పాటు జరగనున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల శిక్షణా తరగతుల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# జగిత్యాల కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆరుగురు విద్యార్థినులకు అస్వస్థత



జగిత్యాల జిల్లా సారంగపూర్‌లోని కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆరుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. అనారోగ్యానికి గురైన విద్యార్థినులను జగిత్యాలలోని జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థినుల పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలుస్తోంది. కస్తూర్బా బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగిందా? లేదా మరే కారణంతోనైనా విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారా? అన్న విషయం తెలియాల్సి ఉంది. కాగా, రెండు రోజులుగా చలి తీవ్రత పెరగడంతోనే అనారోగ్యానికి గురై ఉండొచ్చని కస్తూర్బా పాఠశాల సిబ్బంది చెబుతున్నారు.

# అది ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనం.. సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత విమర్శ

జగిత్యాల జిల్లా సారంగాపూర్ కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆరుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారనే వార్త ఆందోళన కలిగిస్తోందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రతి రోజు రాష్ట్రంలో ఏదో ఒక చోట ఫుడ్ పాయిజన్ తో విద్యార్థులు ఆసుపత్రల పాలవ్వడంతో, సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో వారి పిల్లల క్షేమం పట్ల భయాందోళన నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించకపోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనంగా మారిందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. విద్యా శాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, ఏడాది కాలంలో ఒక్కసారి కూడా సంక్షేమ పాఠశాలలకు వెళ్లి అక్కడి పరిస్థితులను, విద్యార్థుల సమస్యలను తెలుసుకోలేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే సంక్షేమ పాఠశాలలను సందర్శించాలని.. వాటి పరిస్థితులపై సమీక్ష చేసి ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని



డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా సారంగపూర్‌లోని కస్తూర్బా బాలికల పాఠశాలలో బుధవారం ఉదయం ఆరుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. అనారోగ్యానికి గురైన విద్యార్థినులను వెంటనే జగిత్యాల జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థినుల పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలుస్తోంది.




# ఇలాంటి రోజు వస్తుందని ఊహించలేదు: మంచు మనోజ్ భావోద్వేగం

హైదరాబాద్: మీడియా మిత్రులకు తన తండ్రి మోహన్ బాబు, అన్న విష్ణు తరఫున క్షమాపణ చెబుతున్నట్లు నటుడు మంచు మనోజ్ తెలిపారు. ఇలాంటి రోజు వస్తుందని ఊహించలేదన్నారు. జర్నలిస్టుల కుటుంబాలకు ఎప్పుడూ తోడుంటానని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. నాకోసం వచ్చిన మీకు ఇలా జరగడం బాధగా ఉందన్నారు. మీడియాతో మాట్లాడే సమయంలో ఆయన భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు.

**మోహన్‌బాబుపై కేసు నమోదు..** "నా కుటుంబ సభ్యులను ఏమీ అడగలేదు. ఇంట్లో వాళ్ల ఆదాయం మీద ఆధారపడలేదు. సొంతకాళ్లపై పనిచేసుకుంటున్నాను. ఈ వివాదంలోకి నా భార్య, ఏడు నెలల కుమార్తెను లాగుతున్నారు. నా భార్య వాళ్లింట్లోనూ ఏమీ అడగలేదు. సొంతంగా వ్యాపారం చేసుకుంటూ సంపాదించుకుంటున్నాం. ఆస్తికోసం మా నాన్నతో గొడవ పడుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. మా నాన్న దేవుడు.. కానీ.. ఈరోజు చూస్తున్నది మా నాన్నను కాదు. ఇవాళ పోలీసుల విచారణకు హాజరవుతాను. నేను ఎవరిపై దాడి చేశానో సీసీ కెమెరాల దృశ్యాలు చూపించండి. పోలీసుల విచారణ తర్వాత మిగతా విషయాలు వెల్లడిస్తా" అని మనోజ్ వ్యాఖ్యానించారు.

**అందుకే ఈ ఇంటికి తిరిగి వచ్చాను..** కొంతమంది బంధువులు, నాన్న సన్నిహితుల సూచనతో ఈ ఇంటికి వచ్చానని మనోజ్ తెలిపారు. 'ఎన్నో ఏళ్లుగా బయట ఉంటున్నావు. ఇంట్లో అమ్మానాన్న మాత్రమే ఉన్నారు. మీ అన్న ఫ్యామిలీతో దుబాయ్‌కు షిఫ్ట్ అయ్యాడు. నీ భార్య గర్భవతిగా ఉంది. ఆమెకు తల్లిదండ్రులు లేరు. ఈ సమయంలో నీ భార్యకు మీ తల్లి, పెద్దవాళ్ల అవసరముంది. ఒక్కడివే ఎలా చూసుకుంటావు?' అని వారు తనతో అన్నట్లు చెప్పారు. తన భార్య కూడా వారిని సమర్థించి.. మాట వినాలని కోరడంతో ఈ ఇంటికి తిరిగి వచ్చానని వివరించారు.

**ఏ రోజూ ఒక్క రూపాయి అడగలేదు...** "నాపై ఇన్ని ఆరోపణలు చేస్తున్నారు.. దీనికి నేనేమీ చెప్పలేను. ఆధారాలు మాత్రమే చూపించగలను. నేనెప్పటినుంచో కూర్చొని మాట్లాడదామన్నాను. ప్రేమించిన అమ్మాయిని పెళ్లిచేసుకున్నాను. ఆమె కోసం పోరాడాను. అందులో తప్పేముంది? పది మంది కోసం నిలబడినందుకు నేను చెడ్డవాడిని అయ్యాను. ఎక్కడ సంతకం చేయమంటే అక్కడ చేశాను. రమ్మంటే వచ్చాను.. పొమ్మంటే పోయాను. ఎన్ని సినిమాలు చేయమంటే అన్ని చేశాను. అన్న కంపెనీల్లో పనిచేశాను. గొడ్డులా కష్టపడ్డాను. మనస్ఫూర్తిగా, సంతోషంగా చేశాను. ఏ రోజూ ఒక్క రూపాయి అడిగింది లేదు.. ఆశించింది లేదు.

**మధ్యలో మా అమ్మ నలిగిపోతోంది...** ఇప్పుడు నాకు భార్యాపిల్లలు ఉన్నారు. ఈరోజు నేను నిలబడకపోతే రేపు నా పిల్లలు పెద్దవాళ్లయ్యాక వాళ్లకి సమాధానం చెప్పుకోలేను. దొంగతనం చేసి.. వేరే వాళ్ల పొట్టకొట్టి నా పిల్లల మొహం నేను చూడలేను.. ఆ కూడు వారికి పెట్టలేను. మా అమ్మానాన్నలు నన్ను అలా పెంచలేదు. ఈ వివాదంతో మధ్యలో మా అమ్మ నలిగిపోతోంది. నా భార్య వచ్చాక ఇలా అయ్యానని ఆరోపిస్తున్నారు. ఆమె తల్లిదండ్రులు ఉండుంటే ఊరుకునేవారా?ఇవాళ నా భార్యకు తల్లి, తండ్రి అన్నీ నేనే. ఇవాళ నేను సైలెంట్‌గా ఉంటే ఎలా?ఇన్నాళ్లూ ఆగాను.. ఇక ఆగలేను. సాయంత్రం ప్రెస్‌మీట్‌లో ఆధారాలన్నీ బయటపెడతా" అని మనోజ్ చెప్పారు.

# మోహన్‌బాబు, విష్ణుకు హైకోర్టులో ఊరట

హైదరాబాద్: సినీనటుడు మోహన్‌బాబు, విష్ణుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. రాచకొండ పోలీసులు ఇచ్చిన నోటీసులపై హైకోర్టు స్టే ఇచ్చింది. మంచు మనోజ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పహడీషరీఫ్ పోలీసులు.. కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం ఉదయం 10.30గంటలకు విచారణకు హాజరు కావాలని మోహన్‌బాబు, విష్ణుకు నోటీసులు జారీ చేశారు. ఏడాది పాటు ఎలాంటి గొడవల్లో తలదూర్చనని లక్ష రూపాయల పూచీకత్తు ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. పోలీసుల నోటీసులను సవాల్ చేస్తూ మోహన్‌బాబు, విష్ణు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. మంచు మనోజ్ బౌన్సర్లను తీసుకొచ్చి ఇంట్లో గొడవ చేస్తున్నారని మోహన్‌బాబు తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. "కుటుంబ విషయాలను మీడియాలో పెద్దదిగా చేసి చూపిస్తున్నారు. మోహన్‌బాబు అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చేరారు. ఎలాంటి ఆధారాలు లేకుండా పోలీసులు నోటీసులిచ్చారు. రక్షణ కల్పించాలని ఈనెల 9న కమిషనర్‌కు విజ్ఞప్తి చేసినా పరిగణనలోకి తీసుకోలేదు. పోలీసులు ఇచ్చిన నోటీసులను రద్దు చేయాలి" కోర్టును కోరారు. పరస్పర ఫిర్యాదులపై నమోదైన కేసులు కాకుండా.. జర్నలిస్టుపై దాడి చేసినందుకు మోహన్‌బాబుపై మరో క్రిమినల్ కేసు నమోదు చేశామని ప్రభుత్వ న్యాయవాది (జీపీ) కోర్టుకు తెలిపారు. నోటీసులు అందుకున్న మంచు మనోజ్ ఈరోజు విచారణకు హాజరయ్యాడని పేర్కొన్నారు. మోహన్‌బాబు ఇంటి వద్ద పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని ఆయన తరఫు న్యాయవాది నగేష్ కోరగా.. గస్తీ




ఏర్పాటు చేయడం సాధ్యం కాదని జీపీ తెలిపారు. ప్రతి రెండు గంటలకోసారి గస్తీ పోలీసులు మోహన్‌బాబు ఇంటి వద్దకు వెళ్లి వస్తున్నారని చెప్పారు. తదుపరి విచారణ వరకు పరిస్థితిని పర్యవేక్షించాలని న్యాయస్థానం ఆదేశించింది. వాదనలు విన్న ధర్మాసనం.. రాచకొండ పోలీసులు జారీ చేసిన నోటీసులపై స్టే ఇచ్చింది. రాచకొండ పోలీసుల ముందు విచారణకు హాజరయ్యేందుకు ఈనెల 24 వరకు మినహాయింపు ఇచ్చింది. మోహన్‌బాబు మంగళవారం రాత్రి గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తూ తాజాగా ఆస్పత్రి బృందం ఒక హెల్త్ బులెటిన్‌ను విడుదల చేసింది. ఒళ్ళు నొప్పులు, ఆందోళన వంటి కారణాలతో ఆయన ఆస్పత్రిలో చేరారని పేర్కొంది. వైద్య పరీక్షల అనంతరం ఆయనకు కంటి దిగువభాగంలో గాయమైనట్లు గుర్తించింది. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.

# పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కమిషనర్‌పై హైడ్రా కమిషనర్ ఆగ్రహం



రంగారెడ్డి, డిసెంబర్ 11: రంగారెడ్డి జిల్లా కుంట్లూర్ పెద్ద చెరువు కబ్జాపై హైడ్రా సర్వే చేస్తున్న స్థలాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం పరిశీలించారు. కుంట్లూర్ పెద్ద చెరువును కబ్జా చేసి రోడ్డు వేస్తున్నారన్న ఆరోపణలతో నిన్నటి నుంచి హైడ్రా అధికారులు సర్వే చేస్తున్నారు. మున్సిపల్ నిధులతో రోడ్డు నిర్మాణానికి తీర్మానం చేయడంపై పెద్దఅంబర్ పేట్ మున్సిపల్ కమిషనర్ సింగిరెడ్డి రవీందర్ రెడ్డిపై రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో త్వరలో కమిషనర్‌పై యాక్షన్ తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చెరువు భూమిలో ఎలా రోడ్డుకు నిధులు కేటాయిస్తారని రంగనాథ్ ప్రశ్నించారు. సర్వే త్వరగా పూర్తి చేసి చెరువు, పట్టా భూమి బార్డర్‌లో రోడ్డు ఫిక్స్ చేయాలని హైడ్రా సిబ్బందికి ఆయన సూచించారు. చెరువు స్థలంలో రోడ్డు వేస్తే తొలగించాలని హైడ్రా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అయితే రోడ్డు నిర్మాణంలో థర్డ్ పార్టీ చేశారని హైడ్రా కమిషనర్‌కు పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ వివరించారు. ఈ రోడ్డు విషయంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. థర్డ్ పార్టీ ఏర్పాటు చేసినప్పుడు వారిపై కేసులు పెట్టాలి కదా ఎందుకు యాక్షన్ తీసుకోలేదని రంగనాథ్ ప్రశ్నించారు. కాగా.. కుంట్లూరులోని 185 సర్వే నెంబర్లలోని 96 ఎకరాల భూమి కబ్జాకు గురవుతోందంటూ హైడ్రాకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆ స్థలాన్ని పరిశీలించేందుకు నిన్ననే హైడ్రా అధికారులు అక్కడకు చేరుకుని సర్వే నిర్వహించారు. కుంట్లూరులోని 185 సర్వే నెంబర్లోని 95 ఎకరాల చెరువు భూమిలో మున్సిపాలిటీ నుంచి రూ.20 లక్షలు కేటాయించి వ్యవసాయ భూమి వద్దకు సిసి రోడ్ వేసేందుకు మున్సిపల్ వైస్ చైర్ పర్సన్, బంధువులు, కమిషనర్ రవీందర్ రెడ్డిలు సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. ఇది పూర్తిగా అక్రమాలకు తావిచ్చే విధంగా ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని కేవలం వ్యవసాయ భూమి వద్దకే రోడ్డు వేసేందుకు చెరువు స్థలాన్ని కబ్జా చేస్తున్నారని కుంట్లూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ కళ్లెం ప్రభాకర్ రెడ్డి, కళ్లెం వెంకటరెడ్డిలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా అధికారులు మంగళవారం చెరువు వద్దకు చేరుకుని సర్వే చేశారు. అయితే హైడ్రా అధికారులను కొందరు అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. వారిని పోలీసులు అడ్డుకుని అక్కడి నుంచి పంపించి వేశారు.

# ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి.. మంచిర్యాలలో విషాదం

మంచిర్యాల జిల్లాలో విషాదకర ఘటన చోటు చేసుకున్నది. అప్పుల బాధతో ఓ కుటుంబం పరుగుల మందు తాగింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా.. మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఈ ఘటన మంగళవారం జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాండూరు మండలం కాసిపేటలో మంగళవారం చోటు చేసుకున్నది. మొండయ్య (55) అనే రైతు అప్పుల బాధతో భార్య శ్రీదేవి (50), కూతురు చైతన్య (22), కొడుకుతో కలిసి పురుగుల మందు తాగారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత వారిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మొండయ్య, భార్య శ్రీదేవి, కూతురు చైతన్య ప్రాణాలు కోల్పోయారు.



కొడుకు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకున్నది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అప్పుల బాధ భరించలేక ఉసురు తీసుకోవడంతో పలువురు కన్నీటి పర్యంతయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com